



పవిత్ర మెట్ల పూజతో అమ్మవారి సేవలో..

దుర్గమ్మను దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

• పవిత్ర కృష్ణాజలంతో మెట్లు కడిగి, శుభ్రం చేసి, పసుపు రాసి, కుంకుమ బొట్టు పెట్టి, కొబ్బరికాయ కొట్టి..



విజయవాడ, సెప్టెంబరు 24 : వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి లడ్డూ ప్రసాదానికి కలిగిన అపవిత్రతను తొలగించేందుకు 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం జగజ్జనని బెజవాడ కనక దుర్గమ్మను దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రిపై అడుగు పెట్టే ముందు దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం మెట్లను అత్యంత భక్తి శ్రద్ధలతో కృష్ణాజలంతో కడిగి, పసుపు రాసి, కుంకుమ బొట్లు పెట్టారు. చివరి మెట్టుపై కొబ్బరికాయ కొట్టి ఆలయ ప్రాంగణంలోకి పాదం మోపారు. ఆయన వెంట మెట్ల పూజలో ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్ (చిన్ని), కూటమి నేతలు పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఆయనకు వేదపండితులు, అర్చకులు ఆశీస్సులు అందజేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మెట్ల పూజ చేస్తున్నంత సేపూ అభిమానులు, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో అక్కడే ఉండి వీక్షించడంతో కొండపై కోలాహలం నెలకొంది.



ఆక్రమణలపై కొరడా

బందరులో ఆక్రమణలపై కూటమి ప్రభుత్వం కొరడా ఝళిపించింది. కుమ్మరిగూడెం పరిధిలో సర్వే నెంబరు 180లోని ఆక్రమణలను మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులు మంగళవారం తొలగించారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న రూ.100 కోట్ల విలువైన భూమిని పేదల పేరు చెప్పి వైసీపీ నాయకులు కబ్జా చేసి, దానిలో తమ అనుచరులతో రేకుల షెడ్లు వేయించారు. వాటిలో కొన్నింటిని దశల వారీగా పేదలకు రూ.లక్ష చొప్పన అమ్మి సొమ్ము మింగేశారు. భూములు కొని మోసపోయిన పేదలు ఇప్పుడు లబోదిబో అంటూ వైసీపీ నాయకులకు శాపనార్థాలు పెడుతూ, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ నాయకులు ఆక్రమించిన భూమిలో రేకులషెడ్లను కూల్చిన అధికారులు



రూ.100 కోట్ల విలువైన భూమి ఆక్రమించిన వైసీపీ నేతలు

- జాతీయ రహదారి పక్కనే 18.25 ఎకరాల భూమి కబ్జా
- పేదల పేరుతో మెరక, ఆనక అనుచరులతో రేకుల షెడ్లు
- నాడు అధికారుల ఉదాసీనత
- నేడు కూల్చివేత



వైసీపీ నాయకులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి వేసిన రేకులషెడ్లు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లా కేంద్రం మచిలీపట్నంలో వైసీపీ నాయకులు ఆక్రమించిన ప్రభుత్వ భూమిలోని రేకుల షెడ్లను అధికార యంత్రాంగం మంగళవారం తొలగించారు. ఆక్రమణలను తొలగించడం సంచలనం కలిగించింది. జేసీబీలు, ఎక్స్‌కవేటర్లు ఏడింటిని ఏర్పాటు చేసి, ఏకకాలంలో ఆక్రమిత భూమిలో ఉన్న రేకుల షెడ్లను కూలగొట్టారు. ఆక్రమణల తొలగింపును అడ్డుకోకుండా పోలీసులు నగరం నలుమూలలా విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించే ఎత్తుగడలో భాగంగా అధికారంలో ఉన్న సమయంలో వైసీపీ నాయకులు 157 మంది పేదలకు ఈ భూమిలోని స్థలాలను విక్రయించారు. వారిలో 120 మంది రేకులషెడ్లు వేసుకున్నారు. రోజువారీ కూలి చేసుకునే తమ వద్ద ఒక్కో స్థలానికి లక్ష రూపాయల వరకు తీసుకున్న వైసీపీ నాయకులు రేకుల షెడ్లు వేసుకోవాలని, అన్ని సౌకర్యాలు సమకూరుస్తామని చెప్పి నమ్మించి మోసం చేశారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము తీవ్రంగా నష్టపోయామనిబోరుమంటున్నారు.

రూ.100 కోట్ల విలువైన భూమిపై కన్నేసి..

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ వార్డు-2 (కుమ్మరిగూడెం) పరిధిలో 180వ సర్వే నెంబరులో 18.25 ఎకరాల మడుగు, ప్రభుత్వ పోరంబోకు భూమి ఉంది. మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి నెం.65 పక్కనే నగర ముఖద్వారంలోనే ఈ భూమి ఉంది. రూ.వంద కోట్లకుపైగా విలువచేసే ఈ భూమిని ఆక్రమించే క్రమంలో గత వైసీపీ పాలకులు మచిలీపట్నం డంపింగ్ యార్డులోని చెత్తతో కొంత భాగాన్ని మెరక చేశారు. మెరకపనులకు మునిసిపల్ కార్పొరేషన్ నుంచి రూ.10 లక్షలకు పైగా బిల్లులు కూడా చేసుకున్నారు. అనంతరం ఈ భూమిని తమ ఆధీనంలోకి తెచ్చుకుని, పేదలకు ఇళ్లస్థలాలు ఇస్తున్నట్లుగా తెరపై చూపారు. పేదలతో రేకుల షెడ్లు వేయించారు. ప్రభుత్వం నుం చి ఎలాంటి అనుమతులు లేకుండా విలువైన భూమిని ఇళ్లస్థలాలుగా విభజించి ఆక్రమించేసినా అప్పట్లో అధికారులు చూసీ, చూడనట్లుగా వ్యవహరించారు.

వ్యూహాత్మకంగా కబ్జా

మచిలీపట్నం-విజయవాడ జాతీయరహదారి పక్కనే నగరముఖద్వారంలో ఉన్న ఆర్ఎస్ నెంబరు180లోని 18.25 ఎకరాల భూమిని వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వ్యూహాత్మకంగా గత మూడున్నర సంవత్సరాల వ్యవధిలో విడతల వారీగా ఆక్రమిస్తూ వచ్చారు. తొలుత పది ఎకరాల భూమిని ఆక్రమించి అందులో కొంతభూమిలో తమ అనుయాయులతో రేకుల షెడ్లు వేయించారు. ఈ రేకులషెడ్ల వెనుక వైపు భూమిలోకి ఎవ్వరూ వెళ్లకుండా దారులు మూసేశారు. ఈ భూమి వద్దకు ఎవరైనా వస్తే లోపలికి ప్రవేశించకుండా తమ మనుషులతో నిఘా కూడా ఏర్పాటు చేశారు. మళ్లీ తాము అధికారంలోకి వస్తే 18.25ఎకరాల భూమిని తమ సొంతం చేసుకునేందుకు పథకం రచించారు. ఎన్నికలకు ముందు ఇక్కడి రేకుల షెడ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వడంతోపాటు, మునిసిపల్ కార్పొరేషన్ నిధులతో విద్యుత్ సరఫరా, సిమెంటు రహదారి నిర్మాణం కూడా చేశారు. కోట్లాది రూపాయల విలువైన భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించేస్తున్నారని, గతంలో ప్రతిపక్ష హోదాలో ఉన్న టీడీపీ నాయకులు జిల్లా స్థాయి అధికారులకు పలు మార్లు ఫిర్యాదులు చేసినా, అధికారులు కన్నెత్తి చూడలేదు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైసీపీ నాయకులు ఆక్రమించిన భూమిని ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకోవడం గమనార్హం.

స్టేడియం నిర్మాణాన్ని అడ్డుకుని..

మచిలీపట్నం నగర శివారున ఉన్న కుమ్మరిగూడెం వాసులకు 1960వ సంవత్సరంలో 18.25 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ భూమి నుంచి మట్టి తవ్వి తీసుకువెళ్లి కుండలు, ఇతరత్రా పరికరాలు తయారు చేసుకునేందుకు అప్పట్లో రెవెన్యూ అధికారులు అనుమతులు ఇచ్చారు. ఈ భూమిని శాలివాహనులు వినియోగించుకోకపోవడంతో చాలా కాలంగా ఖాళీగానే ఉంటోంది. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ భూమిలో స్టేడియం నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ నాయకులు కుమ్మరిగూడెం వాసులతో దశల వారీగా ఉద్యమాలు చేయించి, వారితో హైకోర్టులో నాలుగు రిట్ పిటీషన్లు వేయించారు. ఈ పిటీషన్లంటినీ ఇటీవల హైకోర్టు కొట్టి వేసినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కుమ్మరిగూడెం వద్ద స్టేడియం నిర్మాణం నిలిచిపోవడంతో గోసంఘం వద్ద స్టేడియం నిర్మాణానికి టీడీపీ ప్రభుత్వం 12 ఎకరాల భూమిని కేటాయించింది. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లేను మచిలీపట్నం తీసుకువచ్చి స్టేడియం నిర్మాణానికి 2019లో శంకుస్థాపన కూడా చేయించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక గోసంఘం వద్ద స్టేడియం నిర్మాణం చేయకుండా అడ్డుకుని, స్టేడియం పనులు ప్రారంభించిన కాంట్రాక్టరును బెదిరించి పంపేశారు.

ముందస్తుగానే హెచ్చరించాం

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ వార్డు-2 (కుమ్మరిగూడెం)పరిధిలో సర్వే నెంబరు.180లో 18.25 ఎకరాల మడుగు, ప్రభుత్వ పోరంబోకు భూమిలో ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని గతంలోనే హెచ్చరికలు జారీ చేశాం. ఇది ప్రభుత్వభూమి అని బోర్డు కూడా ఏర్పాటు చేశాం. ముందస్తుగా చేసిన హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ భూమిలోని ఆక్రమణలను తొలగించాం.

– బాపిరాజు, కమిషనర్, మచిలీపట్నం కార్పొరేషన్

సముచిత స్థానం



కొనకళ్ల నారాయణరావు

కొనకళ్ల నారాయణరావుకు ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ పదవి

- మెరుగైన సేవలందించి పదవికి న్యాయం చేస్తా
- ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు : కొనకళ్ల

మచిలీపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా కొనకళ్ల నారాయణరావును నియమిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవికి కట్టబెట్టడంతో ఆయనకు సముచిత స్థానం కల్పించినట్లయింది. మచిలీపట్నం ఎంపీగా గతంలో రెండు సార్లు, లోక్‌సభ ప్యానల్ స్పీకర్ గా పనిచేసి గుర్తింపు పొందిన కొనకళ్ల నారాయణరావు ప్రస్తుతం కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో కూటమి పొత్తులో భాగంగా మచిలీపట్నం ఎంపీ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. దీంతో కొనకళ్ల ఎన్నికల్లో పోటీ చేయకుండా కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. కొనకళ్లకు సముచితస్థానం కల్పిస్తామని ఎన్నికల సమయంలోనూ, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెబుతూ వచ్చారు. ఆర్టీసీ చైర్మన్ పదవి ఇవ్వడం ద్వారా ఆ మాటను నిలబెట్టుకున్నారు.

కొనకళ్లకు అభినందనల వెల్లువ

ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా నియమితులైన కొనకళ్ల నారాయణరావును మచిలీపట్నంలోని ఆయన నివాసంలో పలువురు కూటమి నాయకులు మంగళవారం కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో తనను ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా నియమించినందుకుగాను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీలో తనకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా నియమించడంతోపాటు, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ పదవిని తనకు ఇచ్చారని అన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో పార్లమెంటులో తాను చేసిన పోరాటాన్ని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రత్యేకంగా గుర్తుంచుకుని, తన త్యాగాన్ని పలు సభల్లో ప్రస్తావించారన్నారు. ఆ విషయం తనకు ఎంతగానో స్ఫూర్తినిచ్చిందని కొనకళ్ల అన్నారు.

ఎదురుమొండి-గొల్లమంద రోడ్డు నిర్మాణానికి రూ.13.45 కోట్లు : పవన్

అమరావతి : నాగాయలంక మండలంలో ఎదురుమొండి-గొల్లమంద రోడ్డు ఇటీవల భారీ వరదలతో ఛిద్రమైంది. ఈ రోడ్డు పునర్నిర్మాణానికి సంబంధించి రూ.13.45 కోట్లు వ్యయ అంచనాలను కలెక్టర్ బాలాజీ, ఈఎన్‌సీ బాలూనాయక్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వద్ద ఉంచడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. ఆ రోడ్డు నిర్మాణాన్ని ప్రాధాన్యంగా తీసుకుని, ఏఐఐబీ నిధులతో నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఎక్సైజ్‌లో బదిలీలలు!

కీలక స్టేషన్లలో సీఐ పోస్టింగ్‌ల కోసం పోటాపోటీ

ఎక్సైజ్‌శాఖలో బదిలీలకు మంచి గిరాకీ ఏర్పడింది. ప్రభుత్వం తెచ్చిన నూతన మద్యం పాలసీ కాసుల వర్షం కురిపిస్తుందన్న ఆశతో కీలకమైన స్టేషన్లపై అధికారులు కన్నేశారు. ఎంత ఖర్చుకైనా వెనుకాడబోమంటూ ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. సిఫార్సు లేఖల కోసం స్థానిక ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) ఎక్సైజ్ శాఖలో బదిలీల జాతర కొనసాగుతోంది. ఈ నెల 30వ తేదీతో బదిలీల ప్రక్రియ ముగియనుంది. ఇప్పటికే డిప్యూటీ కమిషనర్, సూపరింటెండెంట్ పోస్టులకు ప్రయత్నాలు చేసుకున్న వారు దాదాపు తమ తమ పోస్టులను ఖరారు చేసుకోగా, తాజాగా సీఐల పోస్టులకు భారీ ఎత్తున డిమాండ్ నెలకొంది. వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలతో అంటకాగిన వారు, ఏళ్ల తరబడి జిల్లాలో చేసి ప్రస్తుతం బయట చేస్తున్న వారు మళ్లీ రెండు జిల్లాల్లో కీలక స్థానాల్లో పోస్టింగ్ కోసం పైరవీలు చేసుకుంటున్నారు. మొత్తం మీద 21 మంది సీఐలు రెండు జిల్లాల్లో పని చేస్తుంటారు.

కీలక స్టేషన్లపైనే అందరి గురి

విజయవాడ నగరంలోని విజయవాడ తూర్పు(పటమట), విజయవాడ పశ్చిమ(సీతారాంపురం), భవానీపురం స్టేషన్లకు బాగా డిమాండ్ ఉంది. వీటితోపాటు విజయవాడ శివారులోని గన్నవరం, పెనమలూరు సీఐ పోస్టులకూ పోటీ ఎక్కువగా ఉంటుంది. గతంలో విజయవాడ తూర్పు, భవానీపురం స్టేషన్లలో సుదీర్ఘకాలం పనిచేసి ప్రస్తుతం రాజమండ్రిలో చేస్తున్న ఓ సీఐ తిరిగి నగరంలోని ఏదో ఒక స్టేషన్‌కు రావాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే నగరానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి సిఫార్సు లేఖ కూడా ఆయన తీసుకున్నారు. మరో సీఐ భవానీపురం స్టేషన్‌లో చాలాకాలం పనిచేసి ఆ తర్వాత గొల్లపూడి డిపోలో కొంతకాలం చేశారు. తప్పనిసరిగా జిల్లా మారాలన్న నిబంధన కారణంగా కొంతకాలం గన్నవరం వెళ్లి అక్కడ పనిచేసి తిరిగి నగరానికి వచ్చారు. ఎన్నికల సమయంలో ఏలూరుకు బదిలీ చేశారు. ఆయన తిరిగి నగరంలోని ఏదో ఒక స్టేషన్‌లో పోస్టింగ్ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మచిలీపట్నం స్టేషన్‌లో పోస్టింగ్ కోసం కూడా పెద్ద ఎత్తున పైరవీలు నడుస్తున్నాయి.

నూతన మద్యం పాలసీతోనే..

ప్రభుత్వం నూతన మద్యం పాలసీని అనుసరించి టెండర్ల ద్వారా లేదా లాటరీ ద్వారా మద్యం షాపులను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించనుంది. ప్రైవేటు వ్యక్తులు సిండికేట్ ద్వారా మద్యం ధరలు పెంచి విక్రయాలు సాగించేందుకు అవకాశం ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుని అధికారులు నెల మామూళ్లకు తెరలేప వచ్చనే ఆశతో మంచి స్టేషన్ల కోసం పోటీలు పడుతున్నారు. సీఐలకు స్థానిక ప్రజాప్రతినిధి సిఫార్సు లేఖ తప్పనిసరి కావడంతో చాలా మంది సిఫార్సు లేఖల కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు.

వైసీపీకి కొత్త సారథులు?

- కృష్ణాజిల్లాకు పేర్ని నాని
- ఎన్టీఆర్ జిల్లా బాధ్యతలు దేవినేని అవినాశ్‌కు
- నేడు జగన్ వద్ద రెండు జిల్లాల నేతల భేటీ

6లో

ప్రత్యామ్నాయ సాగు

అధిక వర్షాలు, వరదలకు వాణిజ్య పంటలు సాగు చేసిన రైతులు కుదేలయ్యారు. కృష్ణా నదీ తీర భూముల్లో పసుపు, అరటి, కంద సాగు చేసిన రైతులు అపార నష్టానికి గురుయ్యారు. ఈ పరిస్థితుల్లో తిరిగి అవే పంటలను సాగుచేయడం సాధ్యం కానందున ప్రత్యామ్నాయ పంటల సాగుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. మెట్ట రైతాంగం ఎక్కువగా అపరాల సాగుకు ముఖ్యంగా మినుము చల్లుకునేందుకు సన్నద్ధమవుతున్నారు.

అపరాల సాగుకు మెట్ట రైతు సన్నద్ధం

- వాణిజ్య పంటలకు అపార నష్టం
- పసుపు, అరటి, కంద రైతు కుదేలు
- అవే పంటలు సాగు చేయడం అసాధ్యం
- ఖర్చు పెరిగినా మినుము సాగుకే మొగ్గు



నడకుదురులో కల్టివేటర్‌తో పొలాన్ని సిద్ధం చేసుకుంటున్న రైతు

చల్లపల్లి : వరదలకు అపార నష్టానికి గురైన మెట్ట రైతాంగం అపరాల సాగుకు సిద్ధమవుతున్నారు. కృష్ణానదీ తీర భూముల్లో వాణిజ్య పంటలైన పసుపు, అరటి, కంద పంటలు సాగు చేసిన రైతులు వరద కారణంగా తీవ్రంగా నష్టపోయారు. వాణిజ్య పంటల రైతులకు ఎకరాకు సుమారు రూ.లక్షన్నర నుంచి రూ.మూడు లక్షల వరకూ నష్టం జరిగింది. నష్టపోయిన ఏ రైతు ప్రస్తుతం ఆ పంటను సాగుచేసే పరిస్థితి లేదు. అరటి సాగు చేపట్టాలంటే మార్చి వరకు, కంద సాగుకు ఏప్రిల్ వరకు, పసుపు సాగుకు జూన్ వరకు ఆగాల్సిందే. వాణిజ్య పంటలు కోల్పోయిన రైతులు ప్రస్తుతం మినుము సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నారు.

ఖర్చు తడిసి మోపెడైనా తప్పదు

వాణిజ్య పంటలకు జరిగిన నష్టం ఒక ఎత్తయితే పొలాన్ని బాగుచేసుకోవటం మరింత ఖర్చుతో కూడు కున్నది. ప్రధానంగా అరటి రైతులు ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. పొలాల్లో విరిగిపడిన అరటి చెట్లను ఎక్స్‌కవేటర్లతో తొలగిస్తున్నారు. కొందరు రైతులు ట్రాక్టర్లలో వేసి మరో చోట గుట్టలుగా పోస్తుండగా, మరికొందరు పొలంలోనే తగలబెట్టేందుకు గుట్ట చేస్తున్నారు. ఎకరానికి కనీసం ఐదు గంటలు ఎక్స్‌కవేటర్‌తో పనిచేయాల్సి వస్తోంది. ఇందుకు సుమారు ఆరు వేల రూపాయలు ఖర్చవుతుంది. ఆ తర్వాత రెండు సార్లు రొటొవేటర్, ఒకసారి కల్టివేటర్ వేయాల్సి ఉంటుంది. అప్పుడే పొలం పూర్తిస్థాయిలో అపరాల సాగుకు సిద్ధమవుతుంది. ఒకసారి రొటోవేటర్ వేసినా ప్రస్తుతం మినుము విత్తనాలు చల్లుకోవచ్చు. కానీ అపరాల సాగు పూర్తయిన తర్వాతైనా మళ్లీ రొటొవేటర్, కల్టివేటర్ వేయాల్సి ఉంటుంది. రొటోవేటర్ రెండుసార్లు, కల్టివేటర్ ఒకసారి వేయటం ద్వారా పొలంలోని అరటి మొదళ్లు పూర్తిస్థాయిలో తొలగించే అవకాశం ఉంటుంది. వీటి కోసం సుమారు రూ.4 నుంచి రూ.5 వేలు ఖర్చుచేయాల్సి ఉంటుంది. పెట్టుబడి పెట్టలేని చిన్నరైతులు ముందుగా ఒకసారి రొటోవేటర్ వేసి మినుము విత్తనాలు చల్లుకుంటున్నారు. కొందరు రైతులు మాత్రం ఖర్చు ఎక్కువైనా మరోసారి పనిలేకుండా ఒకేసారి పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నారు.

కంద పొలంలో అపరాల సాగు ఇలా..

కంద పొలంలో మాత్రం నేలవాలిన కంద మొక్కలను తొలగించే పనులు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. కంద మొక్కలను పీకిన తర్వాత కర్రతో రంధ్రాలు పెట్టి వాటిలో మినుము విత్తనాలు చల్లుతామని రైతులు చెబుతున్నారు. నేలలో విత్తనం సైజులో కంద ఉంటుందనీ, తర్వాత మొక్కలు వచ్చే అవకాశం ఉంటుందని, మొక్కలు ఏ స్థాయిలో వస్తాయనేది ఇప్పుడే చెప్పలేమని అంటున్నారు. పసుపు చేలలో రొటొవేటర్‌తో గాని, కల్టివేటర్‌తో గానీ పొలం దున్ని అపరాల సాగు చేపడుతున్నారు.



రాముడుపాలెంలో మినుము విత్తనాలు చల్లుతున్న కూలీలు

రైతులు ఏమంటున్నారంటే..

మాగాణి పొలంలో కంటే మెట్ట పొలంలో మినుము విత్తనాలు తక్కువగా చల్లుతామని రైతులు తెలిపారు. ఎకరానికి 12 నుంచీ 15 కిలోల మినుము విత్తనాలు చల్లుతామన్నారు. కిలో మినుము విత్తనం సుమారు 120 రూపాయలకు పైగా ఉందని రైతులు చెబుతున్నారు. మినుము విత్తనం ఉన్న రైతులు తమ సొంత విత్తనాన్ని చల్లుకుంటారని, లేని రైతులు మాత్రం విత్తనాలు కొనుగోలు చేసుకుంటామన్నారు. వాణిజ్య పంటల సాగు ఆశాజనకంగా సాగి మంచి దిగుబడులు వస్తాయనుకున్న రైతులకు వరద నిరాశను మిగల్చగా, ప్రస్తుతం చేపడుతున్న అపరాల సాగు అయినా ఆశాజనకంగా సాగాలని రైతులు ఆశిస్తున్నారు.



స్థానిక మహిళకు కరపత్రం ఇస్తున్న ఎంపీ కేశినేని చిన్ని

ఇది మంచి ప్రభుత్వం

» ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

పాతరాజరాజేశ్వరి పేట, సెప్టెంబరు 24 : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చే ప్రభుత్వమని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీయే కూటమి వందరోజుల పాలనపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని 55వ డివిజన్ నైజాంగేట్ ప్రాంతంలో మంగళవారం ప్రారంభించారు. ఎంపీ ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయకత్వంలో వంద రోజుల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించి, 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్‌లను నివాసాలకు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నివర్గాల ప్రజల అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఇమామ్‌లకు రూ.10వేలు, మౌజామ్‌లకు రూ.5వేల గౌరవ వేతనం వచ్చేనెల నుంచి ఇవ్వనున్నట్టు చెప్పారు. అలాగే హజ్ యాత్రికులకు రూ.లక్ష ప్రభుత్వం అందించనుందన్నారు. పశ్చిమలో డ్రెయినేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని, నైజాంగేట్ ప్రాంతంలోని రైల్వేలైన్‌ల కింద ఉన్న డ్రెయిన్లను మెరుగుపరిచే విషయం అధికారులతో మాట్లాడతానని స్థానికులకు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి గన్నెప్రసాద్ (అన్నా), అధికార ప్రతినిధి నాగుల్ మీరా, కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, నాయకులు ఫతావుల్లా, జాహిద్, హర్షద్, సొంగా సంజయ్ వర్మ, షేక్ కరిముల్లా, వడ్డాది రమణ, యేదుపాటి రామయ్య తదితరులు పాల్గొన్నారు.



మంటాడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎంపీ, ఎమ్మెల్యే హోమం

తిరుమల పవిత్రతను మంటగలిపారు

» ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా ఆవేదన

మంటాడ(పమిడిముక్కల), సెప్టెంబరు 24 : కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడి పవిత్రతను మంటగలిపారని మచిలీపట్నం ఎంపీ వి.బాలశౌరి ఆవేదన వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా మంగళవారం మంటాడ వెంకటేశ్వరస్వామి ఆలయంలో హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమంలో పమిడిముక్కల మండల జనసేన పార్టీ నేత సనకా కిరణ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా, పామర్రు నియోజకవర్గ జనసేన నేత తాడిశెట్టి నరేశ్‌లు పాల్గొన్నారు. లడ్డూప్రసాదంలో కల్తీనెయ్యి దోష ప్రాయశ్చిత్తంగా ఉపముఖ్యమంత్రి చేపట్టిన దీక్షకు మద్దతుగా పార్టీశ్రేణులతో పాటు ప్రజలు పాల్గొన్నారు. తిరుమల వెంకన్న లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడి కోట్లాది భక్తుల మనోభావాలు దెబ్బతీశారని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఆవేదన వ్యక్తంచేశారు.



ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న కనపర్తి శ్రీనివాసరావు

కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేది లేదు

» నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు కనపర్తి

మోపిదేవి, సెప్టెంబరు 24 : తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తే ఎంతటి వారైనా సహించే ప్రసక్తే లేదని అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం మోపిదేవి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల నాగాయితిప్ప పంచాయతీ శివారు పోచిగానిలంక గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఇరువురు కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తల దాడిని ఆయన ఖండించారు. మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మోర్ల వెంకటస్వామి, సాయిరామ్, వెంకమ్మలను ఆయన పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిపై నామమాత్రపు కేసులతో సరిపెట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. వైసీపీ శ్రేణులు ఇంకా అధికార మత్తులోనే తరచూ దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఇదే పునరావృతమైతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పార్టీ కార్యకర్తలపై జరిగిన దాడిపై ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ తీవ్రంగా స్పందించి పోలీసులను హెచ్చరించినట్టు గుర్తుచేశారు. నారా లోకేష్ కార్యకర్తల యోగాక్షేమాలపై సమాచారం రాబట్టి అండగా నిలుస్తున్నారని తెలిపారు.



టీడీపీ తరఫున రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న తంగిరాల సౌమ్య

అపర్ణ కుటుంబాన్ని ఆదుంటాం

» ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ, సెప్టెంబరు 24 : ఉపాధ్యాయులు, వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతిచెందిన గురుకుల విద్యార్థిని కస్తాల అపర్ణ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. మంగళవారం అపర్ణ మృతదేహాన్ని పరిశీలించిన ఆమె పాఠశాల ఉపాధ్యాయుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్డీవో రవీంద్రరావు, ఏసీపీ రవికిరణ్‌తో కలిసి ఆమె ఘటనపై సమీక్ష జరిపారు. విషయాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు వివరించి అపర్ణ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. వెంటనే స్పందించిన ఆయన పార్టీ సహాయం కింద రూ.5 లక్షలు, ప్రభుత్వం నుంచి మరో రూ.5లక్షలు బాధితురాలి కుటుంబానికి అందజేయనున్నట్టు ప్రకటించారన్నారు. అపర్ణ తల్లిదండ్రుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, సోదరులిరువురికి గురుకుల పాఠశాలలో సీట్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారన్నారు. అనంతరం అపర్ణ కుటుంబసభ్యులను ఓదార్చి పార్టీ సాయం కింద రూ. 5 లక్షల చెక్కు అందజేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని సౌమ్య చెప్పారు. తెలుగుదేశం నాయకులు కోట వీరబాబు, కోగంటి బాబు, వాసిరెడ్డి ప్రసాద్, ఉన్నం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్ నీర్ ప్లాంట్ రెడీ

» అక్టోబరు రెండో వారంలో ప్రారంభం.. కేంద్ర మంత్రి రాక » విజయవంతంగా ట్రయల్ రన్స్







మల్లవల్లిలో ఉత్పత్తికి సిద్ధంగా ఉన్న ప్లాంట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

అక్టోబరు రెండోవారంలో రైల్ నీర్ బాటిళ్ల ప్లాంట్‌ను ప్రారంభించేందుకు ఐఆర్‌సీటీసీ రంగం సిద్ధం చేస్తోంది. అక్టోబరు 3న ప్రారంభించాలని ముందుగా నిర్ణయించినా.. అనివార్య కారణాల వల్ల రెండో వారానికి

> మల్లవల్లిలో మరో ప్రతిష్టాత్మక పరిశ్రమ ఐఆర్‌సీటీసీ 'రైల్ నీర్' బాట్లింగ్ ప్లాంట్ సిద్ధమైంది. అక్టోబరు రెండో వారంలో బాట్లింగ్ ప్లాంట్‌ను అధికారులు ప్రారంభించనున్నారు. ప్లాంట్ ఇప్పటికే పూర్తికాగా పక్షం రోజులుగా ట్రయల్ రన్స్ జరుగుతున్నాయి. ఎలాంటి ఆటంకాలు లేకుండా బాటిళ్ల ఉత్పత్తి జరుగుతోంది.

వాయిదా పడింది. కేంద్ర రైల్వే మంత్రి దీనిని ప్రారంభిస్తారని తెలుస్తోంది. పన్నెండేళ్ల క్రితం బెజవాడకు కేంద్ర ప్రభుత్వం రైల్‌నీర్ బాట్లింగ్ ప్లాంట్‌కు కేటాయింపులు చేసింది. అయితే ఈ ప్రాజెక్టు అప్పట్లో పట్టాలెక్కలేదు. ప్రాజెక్టును ఎక్కడ ఏర్పాటు చేయాలన్న మీమాంస చాలాకాలం నడిచింది. రైల్వే స్థలాలు అందుబాటులో లేకపోవటంతో కృష్ణానది దగ్గర రైల్వే బ్రిడ్జి సమీపంలో రైల్ నీర్ బాట్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని అప్పట్లో ప్రజల నుంచి సూచనలు కూడా వచ్చాయి. అయితే ఇక్కడ సాధ్యం కాదని ఐఆర్‌సీటీసీ అభిప్రాయపడింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకురాలేదు. రాష్ట్ర విభజన జరిగి 2014లో టీడీపీ ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేసి పరిశ్రమలు పెట్టేవారికి తక్కువ ధరకు భూములను అవుట్ రేట్ సేల్ (ఓఆర్‌ఎస్) విధానంలో అమ్మకాలు పెట్టడం, పలు ప్రోత్సాహకాలు అందించటంతో.. ఐఆర్‌సీటీసీ అధికారులు మల్లవల్లిలో భూములు కొన్నారు. బాట్లింగ్ ప్లాంట్ ఏర్పాటుకు వెంటనే టెండర్లు కూడా పిలిచారు. గున్‌రాజ్ సంస్థ టెండర్లు దక్కించుకుని యూనిట్‌ను ఏర్పాటు చేసింది. మెషినరీని కొంత మేర తీసుకువచ్చింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు నిలిచిపోయాయి. లక్షల విలువ చేసే మోటార్లు, ఇతర పరికరాల చోరీకి గురయ్యాయని ఆరోపణలు వచ్చాయి. సంఘ విద్రోహశక్తులు అక్కడ జూద కార్యక్రమాలు నిర్వహించారు. ప్లాంట్ పనులు అంగుళం కూడా ముందుకు పడలేదు. దీంతో ఆ సంస్థను వదిలించుకోవటానికి ఐఆర్‌సీటీసీ మూడేళ్ల కాలం పట్టింది. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సందర్భంలో గున్‌రాజ్ సంస్థకు తుది ఫైనల్ నోటీసు ఇచ్చి కాంట్రాక్టు నుంచి టెర్మినేషన్ చేసింది. ఆ తర్వాత వాటర్ బాటిళ్ల రంగంలో మంచి పేరున్న 'మెకాయ్ ఆక్వా' సంస్థకు ప్లాంట్ పనులు అప్పగించటం జరిగింది. మెకాయ్ ఆక్వా ఆధ్వర్యంలో ప్లాంట్ పనులు చకచకా సాగాయి. టీడీపీ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్లాంట్‌ను దాదాపుగా పూర్తి చేసింది. కొద్ది రోజులుగా వాటర్ బాటిళ్ల ఉత్పత్తిని కూడా ట్రయల్ రన్ విధానంలో ప్రారంభించింది. రైల్ నీర్ వాటర్ బాటిళ్లు అందుబాటులోకి వస్తే రైలు ప్రయాణికులకు తక్కువ ధరకు నాణ్యమైన తాగునీరు అందే అవకాశం ఉంది. ఇప్పటి వరకు అధికారులు సికింద్రాబాద్ నుంచి రైల్‌నీర్‌ను తెప్పిస్తున్నారు. రవాణా చార్జీలు అదనపు భారంగా మారుతున్నాయి. విజయవాడ బాట్లింగ్ ప్లాంట్ అందుబాటులోకి వస్తే అటు హైదరాబాద్, ఇటు విశాఖపట్నం వరకు అతిపెద్ద రైల్‌నీర్ సరఫరాదారుగా ఉంటుంది.

నష్టపరిహారం, బీమా కౌలు రైతులకే ఇవ్వాలి

» ఏపీ రైతు, కౌలు రైతుల సంఘాల డిమాండ్



సమావేశంలో ఏపీ రైతు, కౌలు రైతు సంఘాల నేతలు

గవర్నర్‌పేట, సెప్టెంబరు 24 : ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా వరదల వల్ల పంట నష్టపరిహారం వాస్తవ కౌలు రైతులకే ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.క్రిష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి, కౌలురైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ, పంట నష్టపరిహారం, బీమా అన్నీ వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకి ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రెండు హెక్టార్లకే నష్టపరిహారం ఇస్తామనడం సరికాదని, ప్రతిఎకరాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరి పంటకు పెట్టుబడి పెట్టిన వాస్తవ కౌలు రైతు నిలబడాలంటే కనీసం ఎకరాకు రూ. 25 వేలు చెల్లించాలని, దామాషా ప్రకారం వాణిజ్య పంటల సాగుదారులకు పెట్టుబడిలో మూడోవంతు పరిహారం చెల్లించాలని కోరారు. ముఖ్యమంత్రి ప్రకటన, అధికారుల ఆదేశాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. భూ యజమానులు గ్రామస్థాయిలో ప్రభుత్వ రెవెన్యూ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి ఈ-క్రాప్‌లో కౌలుదారుల పేర్లకు బదులు తమ పేర్లు నమోదు చేయించుకుంటున్న సంఘటనలు తమ దృష్టికి వచ్చాయని, దీనిపై అధికారులు దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. వరదల వల్ల దెబ్బతిన్న వ్యవసాయ ప్రాంతాలను తమ బృందాలు పర్యటించి వాస్తవ పరిస్థితులు ప్రభుత్వ అధికారుల దృష్టికి తెస్తామని, కౌలు రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు.

వరద సాయంపై కేంద్రం స్పందనే లేదు

తోట్లవల్లూరు : కృష్ణానది, బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్రబృందం పర్యటించి 15 రోజులైనా దెబ్బతిన్న పంటల పరిహారంపై కేంద్ర ప్రభుత్వం ఇంత వరకు ఎలాంటి ప్రకటన విడుదల చేయకపోవటం శోచనీయమని వి.కృష్ణయ్య అన్నారు. తోట్లవల్లూరులో మంగళవారం వరద బాధిత రైతుల సదస్సు మండల కౌలురైతు సంఘం అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. సదస్సులో కృష్ణయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పంటలకు ఇచ్చే పరిహారం రైతులకు ఏ మాత్రం గిట్టుబాటు కాదని అన్నారు. సీఎం చంద్రబాబు పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, జిల్లా అధ్యక్షుడు కె.శివనాగేంద్రం, ఉపాధ్యక్షురాలు లక్ష్మీశైలజ, ప్రధాన కార్యదర్శి పి.రంగారావు, మండల వ్యవసాయ కార్మిక సంఘం ఇన్‌చార్జి కె.కొండలబాబు పాల్గొన్నారు.

అత్యంత పారదర్శకంగా

నష్టగణన పూర్తి

» నేడు బాధితుల ఖాతాల్లో పరిహారం జమ

» 179 సచివాలయాల పరిధిలో ఎన్యూమరేషన్

» ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



కృష్ణలంక, సెప్టెంబరు 24 : ముంపు ప్రభావిత 179 సచివాలయాల పరిధిలో అత్యంత పారదర్శకంగా నష్టగణన ప్రక్రియను పూర్తిచేసి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన మంగళవారం తెలిపారు. ఈనెల 25న బాధితుల ఖాతాల్లో డీబీటీ విధానం ద్వారా నేరుగా పరిహారం మొత్తాన్ని జమచేయనున్నట్టు వెల్లడించారు. ఏ ఒక్క బాధిత కుటుంబం ఎన్యూమరేట్ కాకుండా ఉండకూడదనే ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా పలు అవకాశాలు కల్పించడం జరిగిందని, అర్హుల జాబితాలను సచివాలయాల్లోను ప్రదర్శించినట్టు తెలిపారు. వివిధ కారణాల వల్ల ఎన్యూమరేషన్ సమయంలో ఇళ్లవద్ద లేనివారిని కూడా ప్రత్యేక బృందాలతో ఆది, సోమవారం ప్రత్యేకంగా నమోదు చేసినట్టు వివరించారు. అయితే 38వ వార్డు నివాసితులు కొందరు తమను కూడా ముంపు బాధితుల జాబితాల్లో చేర్చాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారని, ఈ వార్డు ఎన్యూమరేషన్ పరిధిలోకి రాదని, అందువల్లే సర్వే నిర్వహించలేదని వివరించారు. ఈ బృందాల విచారణలో 38వ వార్డు నివాసితులు అర్హులు కాదని గుర్తించినట్టు కలెక్టర్ స్పష్టం చేశారు.



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు, అధికారులు

ఘనంగా దసరా ఉత్సవాల నిర్వహణ

» పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ, ఎమ్మెల్యేలు

వన్‌టౌన్, సెప్టెంబరు 24 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న దసరా మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఘనమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మంగళవారం మహా మండపంలో దసరా మహోత్సవాల బ్రోచర్, పోస్టర్లను పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాములతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్సవాల నిర్వహణకు కమిటీని నియమించారని తెలిపారు. భక్తుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఉత్సవాలను మరింత మెరుగ్గా నిర్వహించేందుకు భక్తులు సలహాలను ఇవ్వాలని సూచించారు. వరద ముంపుతో బాధపడిన విజయవాడ ప్రజలందరూ సీఎం చంద్రబాబు కృషి, దుర్గమ్మ చల్లని చూపుతో సాధారణ స్థితికి వచ్చారన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామారావు, ఈఈ కోటేశ్వరరావు, స్థానాచార్యులు విష్ణుభొట్ల శివప్రసాద్ శర్మ, అధికారులు పాల్గొన్నారు.

వైసీపీకి కొత్త సారథులు?

» కృష్ణాజిల్లాకు పేర్ని నాని

» ఎన్టీఆర్ జిల్లా బాధ్యతలు దేవినేని అవినాశ్‌కు

» నేడు జగన్ వద్ద రెండు జిల్లాల నేతల భేటీ

» కొడాలి నాని, వల్లభనేని వంశీ వచ్చే అవకాశం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత పార్టీని గాడిన పెట్టేందుకు వైసీపీ పెద్దలు ప్రయత్నాలు ప్రారంభించారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలకు కొత్త సారథులను నియమించేందుకు సిద్ధమవుతున్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు తాడేపల్లిలోని పార్టీ అధినేత జగన్ నివాసంలో రెండు జిల్లాల వైసీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రెండు జిల్లాల్లో పార్టీ పరిస్థితిపై సమీక్షతోపాటు కొత్త సారథుల నియామకం కూడా చేపట్టనున్నట్లు సమాచారం. ఎన్నికల అనంతరం ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీకి కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది. జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయ భాను పార్టీని వీడటంతో అక్కడ కొత్త ఇన్‌చార్జిని నియమించాల్సి ఉంది. మైలవరం నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన సర్నాల తిరుపతిరావు అక్కడ పార్టీని బలోపేతం చేసే పరిస్థితి లేకపోవడంతో మాజీ మంత్రి జోగి రమేశ్‌ను మైలవరం ఇన్ చార్జిగా నియమించారు. అయితే ఆయన, ఆయన తనయుడు కేసుల్లో మునిగి తేలుతుండటంతో వారు కూడా మైలవరంలో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టే పరిస్థితి లేదు. నందిగామలో మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, తిరువూరులో నల్లగట్ల స్వామి దాసు నియోజకవర్గ ఇన్‌చార్జులుగా ఉన్నారు. విజయవాడ తూర్పు ఇన్‌చార్జిగా దేవినేని అవినాశ్ ఉండగా, సెంట్రల్ ఇన్‌చార్జిగా ఎవరు ఉన్నారనే దానిపై స్పష్టత లేదు. గత ఎన్నికల్లో ఇక్కడ పోటీ చేసిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు తిరిగి సొంత నియోజకవర్గమైన పశ్చిమానికి వెళ్లిపోయారు. ఆయన పార్టీ మారే యోచనలో కూడా ఉన్నట్లు సమాచారం. పశ్చిమ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన షేక్ ఆసిఫ్‌ను ఇన్‌చార్జిగా కొనసాగిస్తారా లేదా అన్న దానిపై స్పష్టత లేదు. ఎన్టీఆర్ జిల్లా వైసీపీ బాధ్యత లను దేవినేని అవినాశ్‌కు అప్పగిస్తారని సమాచారం. కృష్ణాజిల్లాలో మచిలీపట్నం నుంచి గత ఎన్నికల్లో పేర్ని కిట్టు పనిచేశారు. అయితే కిట్టుకు అనుభవం లేకపోవడంతో పేర్ని నానికి మళ్లీ జిల్లా వైసీపీ బాధ్యతలు అప్పగించాలని జగన్ భావిస్తున్నారు. ఈ సమావేశానికి కొడాలి నాని, వల్లభనేని వంశీ కూడా హాజరవుతున్నట్లు సమాచారం.

ఆక్వా అభివృద్ధికి చర్యలు తీసుకోండి

» కృష్ణా కలెక్టర్ బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆక్వాకల్చర్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కృష్ణా కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబరులో మత్స్యశాఖ అధికారులు, రైతులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించి, ఆక్వాసాగులో యాంటీబయాటిక్స్ వాడకుండా రైతులకు కనీస అవగాహన కల్పించాలన్నారు. ఆక్వారైతులు కొనుగోలు చేసిన మేత, ఇతరత్రా మందులకు సంబంధించిన బిల్లులను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నిషేధిత యాంటిబయాటిక్స్‌కు సంబంధించిన సమాచారాన్ని రైతుసేవా కేంద్రాలు, సచివాలయాలు, మేత విక్రయించే దుకాణాలు, మత్స్యశాఖకార్యాలయాల్లో ప్రదర్శనగా ఉంచాలని సూచించారు. ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం ప్రకారం అక్టోబరు నెలలో 13,586 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 11,216 ఎకరాలను రిజిస్ట్రేషన్ చేశారని, మిగిలిన లక్ష్యాన్ని పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లామత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్, ఏడీలు, ఎఫ్‌డీవోలు, రైతులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగును ప్రోత్సహించండి

జిల్లాలో పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉద్యాన, మైక్రోఇరిగేషన్ అధికారులు, పతంజలి, వ్యూహన్‌3ఎఫ్ పామాయిల్ కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో పామాయిల్‌సాగుకు అనువైన ప్రాంతాలను అధికారులు గుర్తించాలన్నారు. చెరకు పంటసాగుచేసే ప్రాంతాల్లో పామాయిల్ సాగుచేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలు, వచ్చే లాభాలను వివరించేందుకు క్షేత్రస్థాయిలో తీసుకువెళ్లి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఇటీవల వరదలను తట్టుకుని పామాయిల్ సాగు నిలబడిందని, రైతులు ఈవిషయంపై ఆరా తీస్తున్నారని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. సమావేశంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి, మైక్రో ఇరిగేషన్ పీడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖపై కలెక్టర్ సమీక్ష

విద్యుత్‌శాఖపై కలెక్టర్ బాలాజీ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బాపులపాడు మండలంలోని ఎస్‌ఎస్ రంగన్నగూడెంలో 132కేవీ సబ్‌స్టేషన్‌కు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి పంచాయతీ అధికారులు నిధులు లేవని చెబుతున్నారని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గుడివాడ మండలం మెరకగూడెంవద్ద 220కేవీ విద్యుత్ టవర్‌లు, పెడన మండలం కొంకేపూడి వద్ద 132 కేవీ విద్యుత్ టవర్‌ల నిర్మాణానికి భూమి సమస్యలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. తోట్లవల్లూరు మండలం పాముల్లంక వద్ద విద్యుత్ స్తంభాలు కాకుండా, కేంద్రప్రభుత్వ నిధులతో టవర్లను ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ బాలాజీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. విద్యుత్‌శాఖ ఎస్‌ఈలు ఎం.భాగ్యరాజు, రాజగోపాల్, ఈఈలు ఎం.భాస్కరరావు, జి.జయకరరావు సమావేశంలో పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విమానాశ్రయ డీఎస్పీగా మురళీ రామకృష్ణ బాధ్యతలు



గన్నవరం : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ డీఎస్పీగా పి.మురళీ రామకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ఎస్బీలో సీఐగా ఉన్న అయనను పదోన్నతి కల్పిస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో విమానాశ్రయ డీఎస్పీగా నియమించారు. ఇక్కడ పని చేసిన వెంకటరత్నంను బదిలీ చేశారు. ఈ సందర్భంగా మురళీ రామకృష్ణ మాట్లాడుతూ, విమానాశ్రయ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు.




చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

సీఎం సహాయ నిధికి విరాళం

లబ్బీపేట : ది కృష్ణా డిస్ట్రిక్ ఫైనాన్షియర్స్ అసోసియేషన్ సభ్యులు వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులను ముఖ్యమంత్రి అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ, కార్యదర్శి వి.నాగర్జున, కోశాధికారి టి.హరికృష్ణ, సుంకర వీరభద్రరావు, బీవై నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్, సెపక్ తక్రా స్కూల్ గేమ్స్‌కు ఎన్టీఆర్ జిల్లా ఆతిథ్యం

విజయవాడ స్పోర్ట్సు : 68వ ఏపీ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్‌కు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కేటాయిస్తూ క్యాలెండర్‌ను స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫ్ డైరెక్టర్ వి.విజయరామరాజు విడుదల చేశారని రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి పి.భానుమూర్తి రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 50 క్రీడాంశాలకు అండర్-14, 17, 19 విభాగాల్లో బాలబాలికల పోటీల నిర్వహణకు జిల్లాలు కేటాయించినట్టు తెలిపారు. జిల్లాలకు కేటాయించిన అంతర్ జిల్లా టోర్నమెంట్‌లు నిర్వహించి రాష్ట్ర జట్లను ఎంపిక చేసి జాతీయ పోటీలకు సిద్ధం చేయాలన్నారు. ఎన్టీఆర్ జిల్లాను సైక్లింగ్ రోడ్డు క్రాసింగ్ అండర్-14,17,19విభాగాలతో పాటు, సెపక్ తక్రా అండర్-14 బాలబాలికల టోర్నీల నిర్వహణకు ఎంపిక చేసినట్టు తెలిపారు.



రూ.10లక్షల మంజూరు పత్రాలను అందజేస్తున్న తాతయ్య

బాలుడి వైద్యానికి రూ.10 లక్షలు మంజూరు

జగ్గయ్యపేట : ఆర్టీసీ కాలనీలో వరద నీటితో వచ్చిన ఇన్‌ఫెక్షన్‌తో కాలు పోగొట్టుకున్న బాలుడు కొత్తా భవదీప్‌కు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకృషితో రూ.10లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైంది. మంగళవారం విజయవాడలో బాలుడు చికిత్స పొందుతున్న అంకుర్ ఆసుపత్రిలో మంజూరు పత్రాన్ని అందచేశారు. ఒక్కరోజులో రూ.10లక్షలు సీఎం చంద్రబాబు మంజూరు చేశారు. బాలుడు తండ్రి నాగరాజు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే తాతయ్యకు ధన్యవాదాలు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

కల్తీ నెయ్యితో భక్తుల మనోభావాలకు దెబ్బ : వెలగపూడి

పెనమలూరు, సెప్టెంబరు 24 : వైసీపీ ప్రభుత్వంలో కక్కుర్తి పాలకుల అవినీతి వల్ల జరిగిన కల్తీ నెయ్యి కుంభకోణంతో ప్రపంచ వ్యాప్తంగా తిరుపతి శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు పేర్కొన్నారు. మంగళవారం కానూరులోని తన టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తిరుమలలో అన్య మతస్థులకు అధికారాలు అప్పగించి లడ్డూల్లో జంతువుల కొవ్వు కలపడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో నెయ్యికల్తీకి కారకులైన చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, కరుణాకరరెడ్డిలదే పూర్తి బాధ్యతని, దీనికి సపోర్టు చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని వీరందరితో పాటు ప్రాసిక్యూట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమీర్, ఇమాం, కొండ్రు కోటేశ్వరరావు, దాదా తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి రూ.50 వేలు

ఉయ్యూరు, సెప్టెంబరు 24 : వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి తాండవలక్ష్మి ఇంజ నీరింగ్ ప్రాజెక్ట్ అధినేత మాదాసు శ్రీనివాసరావు రూ. 50వేల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంగళవారం అందజేశారు. సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో వరద ముంపునకు గురై నష్టపోయిన పేద కుటుంబాలకు గ్యాస్‌స్టవ్, రైస్‌కుక్కర్, దుప్పట్లు అందచేసినట్టు తెలిపారు.



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న శ్రీనివాసరావు

నేడు విద్యుత్ నిలిపివేత

ఉయ్యూరు, సెప్టెంబరు 24 : ముదునూరు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ముదునూరు, జబర్లపూడి, సాయిపురం, బోళ్లపాడు గ్రామాల్లో గృహ, వ్యవసాయ వినియోగదారులకు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీసీడీసీఎల్ ఉయ్యూరు ఈఈ డి. కృష్ణనాయక్ తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న కేవీఆర్ కిషోర్

గన్నవరం, సెప్టెంబరు 24 : క్రీడల్లో రాణిస్తేనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్ కిషోర్ అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో రెండు రోజులుగా జరుగుతున్న ఎస్‌జీఎఫ్ బాల బాలికల మండల స్థాయి క్రీడాపోటీలు మంగళవారం ముగిశాయి. క్రీడా పోటీల నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఎంపికైన విద్యార్థులు ఈ నెల 27న జరగబోయే నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పీడీలు వెంకటేశ్వరరావు, లక్ష్మణరావు, నాగరాజు, కేవీ రామారావు, మేరా సాహెబ్, బాలకృష్ణ, కృష్ణప్రియ, విజయకుమారి, గీతా, శాంతికిరణ్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ వైద్యులు గోగినేని భాస్కరరావు మృతి



భాస్కరరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న దాసరి వెంకటబాలవర్ధనరావు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 24 : ఐదు దశాబ్దాలుగా హనుమాన్ జంక్షన్‌లో వైద్యసేవలు అందించిన ప్రముఖ వైద్యులు గోగినేని భాస్కరరావు (88) సోమవారం రాత్రి మృతి చెందారు. వృద్ధాప్యంతో కూడిన అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. గోగినేని భాస్కరరావు భౌతికకా యం వద్ద మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు, టీడీపీ నాయ కులు ఆళ్ల గోపాలకృష్ణ, గుండపనేని ఉమావర ప్రసాద్, వీరమాచనేని సత్యప్రసాద్, వేముపల్లి శ్రీనివాసరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, వేగిరెడ్డి బాలాజీ, విశ్రాంత ప్రిన్సిపాల్ డీవీ.రమణ, మిక్కిలినేని ఈశ్వరరావు, తుమ్మల సుబ్బయ్య, వేగుంట రాము, గోగినేని శివరామకృష్ణ, వీరమాచినేని నాగయ్య, బాపులపాడు మాజీ సర్పంచ్ కాకాని అరుణ, లింగం శ్రీధర్, నాగార్జున సాగర్ ఎడమ కాలవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ యనమద్ది పుల్లయ్యచౌదరి, పాతూరి రాంబాబు, కుటుంబరావు నివాళులర్పించారు.

ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై మాలమహానాడు నేతల ఆగ్రహం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 24 : ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుపాడులో బీఆర్ అంబేడ్కర్ బ్యానర్ చించివేతకు నిరసనగా మంగళవారం హనుమాన్‌జంక్షన్‌లో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ శరత్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో రఘురామ కృష్ణంరాజు దిష్టిబొమ్మ, ఫోటోలు దగ్ధం చేశారు. సంఘం నాయకులు సీహెచ్ మంగరాజు, గొల్ల నరేష్, పోలిమెట్ల మోజేష్, కొత్తూరు సాగర్, తోకల నాగరాజు, చిన్నం కోటి, దొడ్డి ఉమా, పండు నాగార్జున, కత్తుల జాషువా, బేతపూడి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 24 : స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు జరిపించారు. 250 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



వైసీపీ ఐదేళ్ల పాలనలో..



టీడీపీ వంద రోజుల పాలనలో..

ఐదేళ్ల నరకానికి.. వంద రోజుల్లో చెక్

- అధ్వానంగా మారిన కంకిపాడు- పునాదిపాడు ప్రధాన రహదారి అభివృద్ధి
- ప్రజా మన్నన పొందుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, సెప్టెంబరు 24 : ఐదేళ్లు నరకం చూశారు...ఎంతో మంది పడి కాళ్లు, చేతులు విరగొట్టుకున్నారు.. అయినా వైసీపీ పాలకులకు చలించలేదు.. టీడీపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రోడ్డు అభివృద్ధి చేశారు. ప్రజలకు ఉపశమనం కల్పించారు. మండలంలోని కంకిపాడు పునాదిపాడు ప్రధాన రహదారి పరిస్థితి అధ్వానంగా మారింది. రోడ్డు పొడువునా ఏర్పడిన గుంతల కారణంగా ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో గోతుల పడి ప్రయాణికులు, ప్రజలు నరకయాతన పడ్డారు. అయినా ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం గోతులు పూడ్చేందుకు చర్యలు చేపట్టలేదు. అనేక మంది ప్రయాణికులు, పాదచారులు పడి ఆసుపత్రుల పాలయ్యారు. అయినా ప్రభుత్వానికి చలనం రాలేదు. ప్రజల బాగోగులు పట్టించుకోలేదు. 2024లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కేవలం వంద రోజుల్లోనే అధ్వానంగా మారిన రహదారిని అభివృది చేశారు. ప్రజల మన్ననలు పొందారు.

వైసీపీ పాలనలో పట్టించుకోలేదు

ఐదేళ్ల వైసీపీ హయాంలో ఈ రహదారిపై నడిచేందుకు నరకయాతన పడ్డాం. కాళ్లు అరిగేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చుట్టూ తిరిగాం. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను కలిసాం. వంద రోజుల్లో రోడ్డు అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రోడ్డు అభివృద్ధి చేయించారు. ఆయనకు గ్రామస్థులందరం రుణపడి ఉంటాం.



- వెంకట్, స్థానికుడు

రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడపడమే ధ్యేయం

ఆముదాలపల్లి, కొయ్యగూర పాడుల్లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ



కొయ్యగూరపాడులో ఇంటింటికీ బ్రోచర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఉంగుటూరు, సెప్టెంబరు 24 : వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త పాలనతో గతి తప్పిన రాష్ట్రాన్ని, ప్రగతి పథంలో నడపడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. కూటమి ప్రభుత్వ పాలన వందరోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం మండలంలోని ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు గ్రామాల్లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ప్రతి గడపకూ వెళ్లి వందరోజుల్లో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకటబాలవర్ధనరావు, పార్టీ నాయకులు ఆరు మళ్ల వెంకటకృష్ణారెడ్డి, ఆళ్ల గోపాలకృష్ణ, సర్పంచ్ కొరివి మాధవి, మూల్పూరి సాయికళ్యాణి, మేడేపల్లి రమాదేవి, చిరుమామిళ్ల సూర్యం, వడ్డాణం హరిబాబునాయుడు, కొరివి గోపీచంద్, జైపాల్, జనసేన నేత బర్మా భువనభాస్కర్, తహసీల్దార్ జాలాది విమలకుమారి, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

కొండపావులూరులో ..

గన్నవరం : ఎన్నికల హామీలను అమలు చేయగలిగే సత్తా కూటమి ప్రభుత్వానికే ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు అన్నారు. మండలం లోని కొండపావులూరులో ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్‌లను ఇంటింటికీ మంగళవారం అంటించారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో చేసిన ప్రగతిని వివరిం చారు. టీడీపీ నాయకులు జూపల్లి సురేష్, ఆరు మళ్ల కృష్ణారెడ్డి, చిక్కవరపు నాగమణి, దేవినేని సులోచన దేవి, మల్లారెడ్డి కిషోర్, ఎంపీటీసీ సభ్యు డు కొవ్వలి రాజు, కంచర్ల నాగబాబు, ముప్పనేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలూరులో..

కంకిపాడు : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం.. ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, జగన్‌మోహన్ రెడ్డికి ఒక్క చాన్స్ ఇచ్చి రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రిని చేశారన్నారు. సీఎం అయిన నాటి నుంచి రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజ, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మీ, సర్పంచ్ లాం సోనియా, ఎంపీటీసీ పార్వతి, తహసీల్దార్ భవన్నారాయణ, ఎంపీడీవో అనూష, ఈవో శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు రాధాకృష్ణ, పడవల మధుసూదనరావు, కొండవీటి శివయ్య, జనసేన పార్టీ నాయకులు నవీన్, తంబి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు 13వ వార్డులో..

ఉయ్యూరు : రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేస్తూ ఇది మంచి ప్రభుత్వంగా ప్రజల మనస్సులు చూరగొంటుందని మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉయ్యూరు నగర పంచాయతీ 13వ వార్డులో కౌన్సిలర్ పైలా శ్రీనివాసరావు, పార్టీ నాయకులతో కలిసి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు స్థానికులకు తెలియజేశారు. జనసేన నాయకురాలు మహాలక్ష్మి, టీడీపీ నాయకులు అజ్మతుల్లా, అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు. 10వ వార్డులో కౌన్సిలర్ పలియాల శ్రీనివాసరావు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.



ఉప్పలూరులో ప్రజావేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్



ఉయ్యూరు 13వ వార్డులో వైవీబీ రాజేంద్రప్రసాద్

నిబద్ధతతో పనిచేసేవారికి టీడీపీలో గుర్తింపు

కొనకళ్ల నారాయణను అభినందించిన టీడీపీ నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 24 : పార్టీలో నిబద్ధతతో పని చేసే వారికి గుర్తింపు ఉంటుందని, అందులో భాగమే మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావుకు ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా నియమించడని టీడీపీ నాయకుడు చింతల వెంకటశివ అప్పారావు అన్నారు. బందరులోని కొనకళ్ల నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాభినందనలు తెలిపారు. బాపులపాడు మండలంలోని మడిచర్ల, మల్లవల్లి, కొత్తపల్లి, లాంటి మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించేలా చూడాలని కొనకళ్ల దృష్టికి తీసుకువచ్చినట్లు అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొనకళ్ల బుల్లియ్య, వేగిరెడ్డి బాలాజీ పాల్గొన్నారు.

గన్నవరం : ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణకు పలువురు టీడీపీ నాయకులు పూలమాలలు, బొకేలు అందజేసి అభినందనలు తెలిపారు. మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డాణం హరిబాబు నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, మధిరపాడు మాజీ సర్పంచ్ తుమ్మల జగదీష్, సత్యనారాయణ తదితరులు కొనకళ్ల నారాయణను మచిలీపట్నంలో కలసి దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా హరిబాబు నాయుడు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు.



కొనకళ్లను అభినందిస్తున్న జంక్షన్, గన్నవరం టీడీపీ నాయకులు

సాగులో ఆధునిక పద్ధతులు చేపట్టాలి



పెదఅవుటపల్లిలో పొలం పిలుస్తోంది

ఉంగుటూరు, సెప్టెంబరు 24 : సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులు అవలంబించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మండల వ్యవసాయాధికారి వీవీఎస్ఆర్ఎస్ హరీష్‌కుమార్ అన్నారు. వ్యవసాయం, దాని అనుబంధశాఖల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పెదఅవుటపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, వీఏఏలు సురేంద్ర, రసూల్, పాల్గొన్నారు.

ఆరుగొలను, కానుమోలులో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : నూతన సాగు విధానాల ద్వారా రైతును ఆర్థికంగా బలోపేతం చేయడమే పొలం పిలుస్తోంది కార్యక్రమం ఉద్దేశమని ఏవో భవాని అన్నారు. ఆరుగొలను, కానుమోలు గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.



ఆరుగొలనులో..

వరద బాధితులకు అండగా ప్రభుత్వం

ఉప్పలూరు (కంకిపాడు), సెప్టెంబరు 24 : వరద బాధితులకు టీడీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లోని ఉప్పలూరు, తెన్నేరు, మంతెన, గ్రామాల పరిధిలోని వరద బాధితులకు మంగళవారం నిత్యవసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, నష్టపోయిన బాధితుల వివరాల సేకరణ పూర్తైయిందని, తక్షణం నష్ట పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, స్థానిక టీడీపీ నాయకులు చలసాని రాధాకృష్ణ, పడవల మధుసూదనరావు, కొణతం సుబ్రహ్మణ్యం, కొండవీటి శివయ్య, జయరాం, శ్రీను, మల్లేశ్వరరావు, వరలక్ష్మి పాల్గొన్నారు.



డ్రెయిన్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

వీఆర్ సిద్ధార్థలో డ్రెయిన్ల నిర్మాణం పరిశీలన

పెనమలూరు : లక్షల వ్యయంతో నిర్మాణం అవుతున్న వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల డ్రెయినేజీ పనులను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. వీలైనంత వేగంగా పనులు పూర్తి చేయాలని సిబ్బందికి, సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ పెనమలూరు, కంకిపాడు మండల అధ్యక్షులు కోయ ఆనంద్‌ప్రసాద్, సూదిమళ్ల రవీంద్ర ఉన్నారు.

క్రీడా నైపుణ్యం పెంచుకోవాలి

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 24 : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగిన క్రీడాప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఆటల పోటీలను నిర్వహిస్తుం దని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రీడాసక్తితో, తమ నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని బాపులపాడు ఎంపీపీ వై.నగేష్ తెలిపారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో అండర్- 14, అండర్ -17 బాలుర విభాగాల్లో మండలస్థాయి ఎంపిక ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంపీపీ నగేష్ ప్రారంభించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కొన్ని ప్రైవేట్ పాఠశాలల నుంచి 425 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల కన్వీనర్ పామర్తి వెంకటేశ్వరరావు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.555

ఎంపీటీసీ సభ్యుల డుమ్మా.. మండల సమావేశం వాయిదా

అవనిగడ్డ, సెప్టెంబరు 24 : మండలంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై తమకు సరైన సమాచారం లేదంటూ ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరుకాకపోవడంతో మంగళవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మండల పరిషత్ పాలకవర్గం ఏర్పడి మూడేళ్ల సందర్భంగా మంగళవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద వేడుకలు జరుపుకున్నారు. అనంతరం సర్వసభ్య సమావేశంలో పాల్గొనాలి. అయితే అభివృద్ధి కార్యక్రమాల విషయంలో తమకు సరైన సమాచారంలేదని, సమావేశానికి రామని వెళ్లిపోయారు. నచ్చచెప్పేందుకు ప్రయత్నించినా వినలేదు. దాంతో కోరం లేక అధికారులు సమావేశాన్ని వాయిదా వేశారు.



ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల, మాజీ ఎమ్మెల్యే రావిలకు సత్కారం



నడుపూరులో ఎమ్మెల్యే కాగిత, వేదవ్యాస్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



పమిడిముక్కల పంచాయతీ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

అందినకాడికి దోచేశారు..

● గత వైసీపీ పాలనపై కూటమి నేతల ధ్వజం ● ఇది మంచి ప్రభుత్వంకు విశేష స్పందన

నందివాడ, సెప్టెంబరు 24 : నందివాడను ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. నందివాడలో మంగళవారం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మండలంలో తాగు నీటి సమస్య ఎక్కువగా ఉందన్నారు. సమస్య తీర్చాలంటే పంచాయతీలపై భారం పడకుండా నీటి సంఘం కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. అలా ఏర్పాటు చేసుకుని కొంత గ్రాంట్ కేంద్రం నుంచి తీసుకొచ్చి మొట్టమొదటిగా కృష్ణా జిల్లా నుంచే ప్రతీ ఇంటికి తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాలును అడిగారని, త్వరలో అది కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రతీ విషయంలో ముందుగానే ఆలోచించి కార్యచరణ చేపడతారన్నారు. 100 రోజుల కూటమి ప్రభుత్వంలో హామీలు అమలు చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అధికారులు, రాజకీయ నాయకులు కలిసికట్టుగా పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రకటించిన కార్యక్రమాలు నెరవేర్చే వ్యక్తి చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇంచార్జి బూరగడ్డ శ్రీకాంత్, ఆర్.కె.పిన్నమనేని బాబ్జీ, దానేటి సన్యాసిరావు, ఎంపీడీవో నాగేశ్వరరావు, మల్లిక పాల్గొన్నారు.

కూటమికి అన్ని వర్గాల ఆదరణ

మచిలీపట్నం టౌన్ : కూటమి ప్రభుత్వానికి అన్ని వర్గాల నుంచి ఆదరణ లభిస్తోందని టీడీపీ కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. బొర్రపోతుపాలెం, బుద్దాలపాలెంలో ఇంటింటికీ కరపత్రాలు ప్రజలకు అందించారు. రూరల్ అధ్యక్షుడు కుంచే నాని, క్లస్టర్ ఇన్‌చార్జి తలారి సోమశేఖర్, కొనకళ్ళ నాగరాజు, సిరివెళ్ళ సాంబయ్య, పాల్గొన్నారు. ఒకటో డివిజన్‌లో బత్తిన దాసు, మోటమర్రి బాబాప్రసాద్, జనసేన నాయకుడు వంపుగడల చౌదరి తదితరులు పాల్గొన్నారు. కేపీటీ పాలెంలో మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, లంకే నారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

పెడన రూరల్ : నడుపూరు సచివాలయం వద్ద ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మాజీ ఉప సభాపతి బూరగడ్డ వేదవ్యాస్ ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అందినకాడికి దోచుకున్నారన్నారు. అనంతరం రూ.11 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బూరగడ్డ కిషన్‌తేజ, గుడిశేవ రామారావు, శీరం ప్రసాద్, పరసా వెంకటేశ్వరరావు, కన్నిపోటు సాయి కిరణ్, చీర్ల అనూష పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు

పమిడిముక్కల : సంక్షోభం లోనూ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పమిడిముక్కల పంచాయతీ వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఎన్నికల హామీలను త్వరలో అమలుచేసేందుకు కృతని శ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు. సర్పంచ్ ముళ్లపూడి సునీత, టీడీపీ నాయకులు రాజులపాటి శ్రీనివాసరావు, జక్కా శ్రీనివాసరావు, జనసేన నాయకుడు తాడిశెట్టి నరేశ్ పాల్గొన్నారు.

కోడూరు: సంక్షోభంలోనూ కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని అందిస్తుందని కూటమి నాయకులు అన్నారు. మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కోడూరులో మండల జనసేన పార్టీ అధ్యక్షుడు మర్రే గంగయ్య ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులతో కలసి కరపత్రాలు ప్రజలకు అందించారు. వంద రోజుల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కొండవీటి సునీత, కోట రాంబాబు, పూతబోయిన సీతారత్న సాయిబాబు, కాగిత రామారావు, కోట ప్రసాద్, పెద్ది వెంకట్ పాల్గొన్నారు.

రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

పొలం పిలుస్తోందిలో జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్త శైలజరాణి

పామర్రు, సెప్టెంబరు 24 : పంటల సాగులో మెలకువలు, రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభు త్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్త కె.శైలజరాణి అన్నారు. శ్యామలపురంలో మంగళవారం ఆమె మాట్లా డుతూ, ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసుకునేలా రైతుల్లో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకురాలు నూతలపాటి పద్మావతి మాట్లాడుతూ, వ్యవసాయానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. అలాగే ఊరుటూరు కార్యక్రమంలో సహాయ సంచాలకులు బిస్వర్ణలత, ఏవో శివనాగరాణి, రైతుశిక్షణా కేంద్రం కోఆర్డినేటర్ జ్యోతి రమణ తదితరులు పాల్గొన్నారు.



శ్యామలపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శైలజరాణి, లింగవరంలో జ్యోతి తదితరుల

లాభాలు ఆర్జించేలా పొలం పిలుస్తోంది..

గుడివాడ రూరల్: రైతులకు ఆధునిక వ్యవసాయంతోపాటు వివిధ రకాల వృత్తులు కొనసాగిస్తూ మంచి లాభాలు ఆర్జించే విధంగా కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు డీఆర్‌సీ డిప్యూటీ డైరెక్టర్ కె.జ్యోతి రమణి అన్నారు. లింగవరం ఆర్‌బీకే కార్యాలయం వద్ద రైతులతో మాట్లాడుతూ గుడి వాడ మార్కెట్ యార్డులోని వసతులను వివరించారు. వెటర్నరి డాక్టర్ ఉన్నం హనుమంతరావు, ఏవో అనంతలక్ష్మి, ఏడీఏ కె.శ్రీనివాసరావు తదితరులుపాల్గొన్నారు.

వరిలో అధిక దిగుబడులపై అవగాహన

కూచిపూడి : వరిలో అధిక దిగుబడులకు పలు అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు.పెడసనల్లులోఈ-క్రాప్ నమోదు, పంటల బీమా, వ్యవసాయ యాంత్రీకరణ తదితర అంశాలను వివరించారు. ఏడీఏ శ్యామల, ఏవో శివప్రసాద్, శాస్త్రవేత్త డాక్టర్ నవీన్, వీఏఏ చక్రవర్తి పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పని సరి

కోడూరు: రైతులు ఈకేవైసీ తప్పక చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ తెలిపారు. కూటమి నాయకులు బండే శ్రీనివాసరావు, మర్రే గంగయ్య, ఉల్లి శేషగిరిరావు, పిల్లి మల్లికార్జునరావు, కాగిత రామారావు పాల్గొన్నారు.

ఘంటసాల : అచ్చెంపాలెం, శ్రీకాకుళం రైతు సేవా కేంద్రాల వద్ద ఏడీఏ ఎస్.శ్యామల మాట్లాడుతూ ప్రతీ మంగళ, బుధవారాల్లో వ్యవసాయం, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు పంటల సాగుపై అవగాహన కల్పిస్తారన్నారు. అచ్చెంపాలెం సర్పంచ్ గాజుల నాగ శ్రీనివాసరావు, మార్కెటింగ్ యార్డు సూపర్‌వైజర్ ఎం.సురేష్ బాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రసాయనాలు తగ్గించుకోవాలి

నాగాయలంక : వరి సాగులో రసాయనిక మందుల వాడకాన్ని రైతులు తగ్గించుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జె.ఎస్.జయప్రదం సూచించారు. నాగాయలంకలో రైతు సేవా కేంద్రంలో సస్యరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో టి.ఎస్.హారిక, సిబ్బంది పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : అంగలూరు, చంద్రాల వరి పొలాల్లో రైతులు, ప్రజాప్రతినిధులతో కలసి పొలం పిలుస్తుంది నిర్వహించారు. టీడీపీ నాయకుడు అడుసుమిల్లి రామ్మోహనరావు, రాము తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గీతాంజలిశర్మ

నిర్వాసితులకు పరిహారం అందజేస్తాం : జేసీ

గుడివాడ రూరల్, సెప్టెంబరు 24 : రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వల్ల నష్టపోయిన నిర్వాసితులకు ప్రభుత్వ పరిహారం అందజేస్తుందని జేసీ గీతాంజలి శర్మ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం గుడివాడ - మచిలీ పట్నం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వల్ల నష్టపోయిన వారితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బందికి వివరాలు, ఆధార్, తదితర సర్టిఫికెట్లు అందజేయాలని వారికి సూచించారు. ఒక్కొక్కరు ఎంత నష్టపోయింది, ఎంత పరిహారం వస్తుందో వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామకోటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

భూసార పరీక్షా కేంద్రం పరిశీలన

గుడివాడలో పాతభూసార పరీక్ష కేంద్రాన్ని పునఃప్రారంభించటానికి సిద్ధమవుతున్నట్లు గొల్లపూడి భూసార పరీక్షా కేంద్ర ఏడీఏ పద్మజ అన్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఈ కేంద్రం మూతపడింది. కేంద్రంలో ఉన్న పరికరాలు బాగున్నాయని, చిన్న చిన్న మరమ్మతులతో వెంటనే ప్రారంభించవచ్చునన్నారు. వచ్చే వేసవి నాటికీ మట్టి నమూనా ల్యాబ్ అందుబాటులో ఉంటుందన్నారు. ఏడీఏరమాదేవి, ఏవో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలకు నష్టపరిహారం అందించాలి

కూచిపూడి : ఇటీవల వరదలకు దెబ్బతిన్న వాణిజ్య పంటలు కంద, పసుపు తదిత రాలకు లక్ష రూపాయల నష్టపరిహారం అందించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. మొవ్వ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. వరికి రూ.25 వేలు, వాణిజ్య పంటలకు లక్ష రూపాయల పరిహారం అందించాలన్నారు. శీలం నారాయణరావు, వడ్డి వెంకటేశ్వరరావు, కరుణకర్, బసవేశ్వరరావు, పాండవులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.లక్ష విరాళం

చల్లపల్లి, సెప్టెంబరు 24 : రావెళ్ల ఫౌండేషన్ ఛైర్మన్ రావెళ్ల ఉదయ్‌కుమార్ సీఎం చంద్రబాబుని కలిసివరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు లక్ష రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో కిలారు సోమశేఖర్, బత్తిన రాజేష్‌బాబు, కాకర్లపూడి తేజా రాజు పాల్గొన్నారు.



సీఎంకు చెక్కు అందిస్తున్న రావెళ్ల ఉదయ్‌కుమార్ తదితరులు

అప్సా ఔదార్యం

పెడన : ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ఔదార్యం ప్రదర్శించింది. మచిలీపట్నం, గుడివాడ డివిజన్లకు చెందిన 50ప్రైవేట్ స్కూల్స్ అధినేతలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ. 7లక్షల 92 వేల 361లు సేకరించారు. విరాళాన్ని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అనుమకొండ గౌరీప్రసాద్‌కు విశ్వభారతి హైస్కూల్‌లో మంగళవారం అందజేశారు. ఈనెల 26న సీఎం చంద్రబాబుకు అందజేస్తామని గౌరీప్రసాద్ తెలిపారు. అప్సా నాయకులు కొమ్మారెడ్డి కిషోర్, వి. సుందరరాం, రాజు పాల్గొన్నారు.

మహిళా సంఘాల సభ్యులు

పామర్రు: టీడీపీ కార్యాలయంలో మంగళవారం కురుమద్దాలి గ్రామ మహిళ సంఘం రూ.50 వేలు ఎమ్మెల్యే రాజాకు అందజేశారు. యల్లమర్రుకు చెందిన సుంకర శ్రీనాద్ రూ.20వేలు ఎమ్మెల్యేకు అందజేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నందివాడ (తుమ్మలపల్లి) : వరద బాధితులకు విశాఖపట్నం హోళి చర్చి ఫాదర్ రెవ.డి.జె.విల్సన్ బాబు హైకోర్టు అడ్వకేట్ సుఖవేణి ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు మంగళవారం తుమ్మలపల్లి సీఎస్ఐ చర్చి ఆవరణలో అందజేశారు సర్పంచ్ సింగాల రాధాకృష్ణ, మాజీ సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

27 నుంచి సమ్మెలోకి యూబీఐ ఉద్యోగులు



మచిలీపట్నం టౌన్ : సమస్యల పరిష్కారం కోసం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఉద్యోగులు ఈనెల 27 నుంచి సమ్మెలోకి వెళుతున్నట్టు సంఘ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాస్ తెలిపారు. రీజనల్ ఆఫీసు ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. 20 డిమాండ్లతో ఈనెల 9న నోటీసు ఇచ్చామన్నారు. ప్రదర్శనలో డి.రాజేష్‌బాబు, బి. యోహాన్, వై.దుర్గారావు, డి. సలాం, ఆర్.ఎస్.వాణి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

చాగంటిపాడు మహిళల మొక్కు చెల్లింపు

తోట్లవల్లూరు, సెప్టెంబరు 24 : టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎం కావటంతో చాగంటిపాడుకు చెందిన 20 మంది టీడీపీ కార్యకర్తలు మంగళవారం విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానానికి కాలినడకతో వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. సోమవారం రాత్రి చాగంటిపాడు నుంచి బయలుదేరి మంగళవారం ఉదయానికి చేరుకున్నారు. తోట్లవల్లూరు వద్ద వీరంకి వెంకట గురుమూర్తి, చక్కా ఉదయభాస్కర్ అల్పాహారం అందించారు.

ప్రారంభమైన మండల స్థాయి ఆటల పోటీలు

కూచిపూడి : మొవ్వ మండల స్థాయి ఆటల పోటీలు కోసూరు జడ్పీ పాఠశాలలో మంగళవారం ప్రారంభమయ్యాయి. అండర్-14, అండర్ -17 బాలబాలికల విభాగంలో కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా అంశాల్లో పోటీలు జరిగాయి. నియోజకవర్గ స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. స్పోర్ట్స్ ఇంచార్జి కృష్ణమోహన చందు, ఎంఈవో శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు డొక్కు భూలక్ష్మి, ఎస్ఎంసీ ఛైర్మన్ గోరిపర్తి శ్రీలత, హెచ్ఎం నాగమణి, పీడీలు రామారావు, నాగశివ, బసవయ్య, మనోహరి, వర్మ, రాజశేఖర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కోడూరు: భార్యాభర్తల తగాదాలలో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన విశ్వనాథపల్లిలో చోటు చేసుకుంది. మారుబోయిన రోజా (31) భర్త వెంకటరమణతో ఈ నెల 22వ తేదీన గొడవపడి ఎలుకలమందు తీసుకుంది. గుర్తించిన కుటుంబ సభ్యులు మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై పి.శిరీష తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసులపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

చల్లపలి : ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వెళ్లిన పోలీసులపై దాడులకు తెగబడిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు అన్నారు. చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, నిమ్మగడ్డలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందనే సమాచారంతో వెళ్లిన పోలీసు సిబ్బందిపై అక్రమార్కులు దాడికి దిగటం క్షమించరాని నేరమన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు సీపీఐ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేశామని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు పెటనుమత్స రాజారత్నం, లంక నాగమల్లి, సిద్ధాబత్తుల వాసు పాల్గొన్నారు.



కొనకళ్లను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

కొనకళ్లకు పదవీ సత్కారం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 24 : మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావుకు ఆర్టీసీ ఛైర్మన్‌గా నియమించినందుకు పలువురు ఆనందం వ్యక్తంచేశారు. మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మాజీ ఛైర్మన్ తలారి సోమశేఖర్, టీడీపీ కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, బందరు రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడు కుంచే నాని, ఆర్యవైశ్యసంఘ నాయకులు కొనకళ్ల నారాయణరావుతో సోదరుడు బుల్లయ్యను గజమాలలతో సత్కరించారు. ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

నాగాయలంక: త్యాగానికి గుర్తింపుగా సీఎం చంద్రబాబు కొనకళ్లకు తగిన ప్రాధాన్యం ఇచ్చారని నేతలు వర్రే రాంబాబు, మాజీ జడ్పీటీసీ కన్నా నాగరాజు, భావదేవరపల్లి సర్పంచ్ ఉదయభాస్కర్, పెదపాలెం సర్పంచ్ దున్న రాజేష్, తదితరులు అభినందనలు తెలిపారు.

కోడూరు : మండల టీడీపీ నాయకులు బండే శ్రీనివాసరావు, పిల్లి మల్లిఖార్జునరావు, గోగినేని సోమశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి: నారాయణరావు నియామకంపై టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మోర్ల ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. పొత్తుల్లో భాగంగా ఎంపీ స్థానం మిత్రపక్షానికి కేటాయించినప్పటికీ పార్టీకి అంకితభావంతో అభ్యర్థుల విజయాలకు ఎనలేని కృషిచేశారని తెలిపారు. నిబద్ధత కలిగిన నేత కొనకళ్లకు ఆర్టీసీ ఛైర్మన్ ఇవ్వటం సంతోషకరమన్నారు.

లంక గ్రామాల్లో మునిగిన ఇంటికి రూ.10 వేలు

తోట్లవల్లూరు: మండలంలోని ఎనిమిది లంక గ్రామాల్లో వరదకు మునిగిన గృహాల లెక్కింపు మంగళవారంతో పూర్తయిందని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి తెలిపారు. జాబితాలను ప్రభుత్వానికి పంపించామన్నారు. నీట మునిగిన రూ.10 వేల చొప్పున సహాయం రానుందన్నారు.

ఇది జగన్ పాపమే!

- పోలవరానికి ఆయన జమానాలోనే ప్రధాన నష్టం
- 2019, 20ల్లో వచ్చిన వరదలకే దెబ్బతిన్న డయాఫ్రం వాల్
- ప్రధాన డ్యాం ప్రాంతంలో భారీ గుంతలు
- తేల్చిచెప్పిన అంతర్జాతీయ నిపుణులు.. ప్రాజెక్టు అథారిటీకి నివేదిక

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



జగన్మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాతే 2019, 2020లో వచ్చిన వరదలకు డయాఫ్రం వాల్ సహా పోలవరం ప్రాజెక్టు కీలక నిర్మాణాలు దెబ్బతిన్నాయని అంతర్జాతీయ నిపుణుల కమిటీ (పీఈవో) స్పష్టం చేసింది. ఆయన హయాంలోనే ప్రాజెక్టుకు ప్రధాన నష్టం జరిగిందన్నారు. ఆయన బాధ్యతలు చేపట్టాక నిర్మాణాన్ని యథాతథంగా కొనసాగించి ఉంటే.. డయాఫ్రం వాల్‌పై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాంను నిర్మించి ఉంటే.. 2020 వరదలకు వాల్ దెబ్బతినేది కాదని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి పంపిన సమగ్ర నివేదికలో పేర్కొంది. ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్ దెబ్బతినడంతో.. మరమ్మతులు చేయాలా, కొత్తది నిర్మించాలా అనే సందేహాల నివృత్తికి అమెరికా, కెనడా దేశాలకు చెందిన ఇద్దరేసి నిపుణులను కేంద్ర జలశక్తి శాఖ నియమించింది. అమెరికాకు చెందిన ప్రాజెక్టుల నిర్మాణ నిపుణులు జియాన్ ఫ్రాంకో డి సిక్కో, డేవిడ్ బి పాల్.. కెనడా నిపుణులు సీన్ హించ్‌బెర్గర్, రిచర్డ్ డొనెల్లీ జూన్ 30, జూలై మొదటివారంలో ప్రాజెక్టు ప్రాంతంలో 4 రోజులు పర్యటించి స్వదేశాలకు వెళ్లిన వీరు.. తర్వాత ప్రాథమిక నివేదిక పంపారు. అందులోని కొన్ని అంశాలపై కేంద్ర జల సంఘం, రాష్ట్ర జల వనరుల శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ప్రధానంగా 2016లో ప్రారంభించిన వాల్ 2018లోనే పూర్తయితే.. 2018లోనే దెబ్బతిన్నట్లుగా ప్రాథమిక నివేదికలో పేర్కొనడాన్ని ఆక్షేపించాయి. సమగ్ర అధ్యయనం చేశాక.. స్పష్టమైన నివేదిక ఇవ్వాలని అంతర్జాతీయ నిపుణులను కోరుతూ లేఖ రాశాయి. దీనిపై స్పందించి అధ్యయనం చేసిన వారు.. సోమవారం పీపీఏకి సమగ్ర నివేదిక పంపారు. 2019, 2020ల్లో వచ్చిన భారీ వరద ప్రవాహాన్ని స్పిల్‌వేతో పాటు ప్రధాన డ్యాం ప్రాంతం మీదుగా వదిలేయడం వల్లే డయాఫ్రం వాల్ దెబ్బతిందని అందులో స్పష్టం చేశారు. 2020లో వచ్చిన భారీ వరద ప్రవాహ సుడుల కారణంగా 485 మీటర్ల మేర వాల్‌కు నష్టం జరిగిందని.. గ్యాప్-2 ప్రాంతంలో భారీ గుంతలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఇలా దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌కు మరమ్మతు చేయడం కంటే.. కొత్తది నిర్మించడమే ఉత్తమమని తెలిపారు. ఈ దిశగా ఎప్పుడో నిర్ణయం తీసుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. మేఘా ఇంజనీరింగ్ సంస్థకు నిర్మాణ బాధ్యతను అప్పగించాయి కూడా.

మరిన్ని సూచనలివీ..

2023 జూలై 21న ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల మధ్య బూడిద రంగులో ఉన్న బురదతో కూడిన సీపేజీని గుర్తించారు. ఈ బురద 7.91 మీటర్ల ఎత్తులో నిల్వ ఉంది. గత ఏడాది ఆగస్టు రెండో తేదీన 7.91 మీటర్లు, ఈ ఏడాది జూలై 21న 15.57 మీటర్లు, జూలై 22న 13.76 మీటర్లు, జూలై 29వ తేదీన 11.31 మీటర్ల మేర సీపేజీ వరద రెండు కాఫర్ డ్యాంల మధ్య నిల్వ ఉంది. ఈ సీపేజీని తగ్గించేందుకు పంపింగ్ ద్వారా డీవాటరింగ్ చేయాలని నిపుణులు పేర్కొన్నారు. 'కొత్త వాల్ నిర్మాణం సందర్భంగా ప్లాక్సిస్, సిగ్మా, అన్సిస్ పరీక్షలు నిర్వహించాలి. దాని నిర్మాణం ప్రస్తుతం ఉన్న డయాఫ్రం వాల్‌కు దిగువ భాగాన నిర్మించాలి. ఇప్పుడున్న వాల్ నిర్మాణ విధానాన్నే కొత్త వాల్‌కూ అనుసరించాలి. పొడి వాతావరణంలో, నేత చిత్తడిగా లేనప్పుడు దాని నిర్మాణం చేపట్టాలి' అని సూచించారు. ఈ ఏడాది నవంబరులో మొదలుపెట్టి.. 2025 జూలైలోగా డయాఫ్రం వాల్‌ను నిర్మించేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధంచేసిన కార్యాచరణ ప్రణాళికను నిపుణులు ఆమోదించారు. ఒకే సీజన్‌లో వాల్ నిర్మాణం పూర్తి చేయడం మంచిదన్నారు. ప్రధాన డ్యాం నిర్మాణ సమయంలో.. జలసంఘం, పీపీఏ, కాంట్రాక్టు సంస్థ నిరంతరం చర్చించుకుంటూ సమన్వయంతో పనులు పూర్తి చేయాలని, డిజైన్లపై వర్క్‌షాపు నిర్వహించుకోవాలని పేర్కొన్నారు.



అబద్దయ్య | అజయ్ బాబు | పీతల సుజాత | తాతయ్య బాబు | శ్రీనివాసులు | దామచర్ల సత్య | దీపక్ రెడ్డి | సుబ్బారెడ్డి | లంకా దినకర్ | బంగార్రాజు | మాణిక్యాలరావు



సత్యనారాయణ | బాలాజీ | శివశంకర్ | సీతారామ సుధీర్ | బాబురావు

బడుగులకు పెద్దపీట!

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని అదే టెలికాన్ఫరెన్స్‌లో చెప్పిన చంద్రబాబు.. అదే మాట ప్రకారం బాగా పనిచేసినవారు తొలి జాబితాలో ప్రముఖంగా కనిపించేలా చూశారు. కేవలం పై స్థాయి నాయకులే కాకుండా కింది స్థాయిలో పనిచేసిన వారికీ చోటు కల్పించారు. ఎన్నికల ముందు టీడీపీ అంతర్గతంగా ఐదు వేల మంది ఓటర్లకు ఒక యూనిట్ ఇన్‌చార్జిని.. 25 వేల మందిని ఓటర్లకు ఒక క్లస్టర్ ఇన్‌చార్జిని నియమించి వారితో ఎన్నికల యుద్ధాన్ని నడిపించింది. ఇందులో ఒక క్లస్టర్ ఇన్‌చార్జికి ఇప్పుడు ఏకంగా చైర్మన్ పదవి లభించింది. శ్రీకాకుళం జిల్లాలో కాళింగ సామాజిక వర్గానికి చెందిన వజ్జా బాబూరావు ఇటీవలి ఎన్నికల్లో ఒక ప్రాంతంలో క్లస్టర్ ఇన్‌చార్జిగా పనిచేశారు. ఆయన్ను రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్‌గా నియమించారు. చైర్మన్, డైరెక్టర్లు కలిపి మొదటి జాబితాలో 99 మందికి చోటు కల్పించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా టీడీపీ తన అభ్యర్థులకు సంబంధించి 99 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేయడం విశేషం. వీరిలో 11 మంది క్లస్టర్ ఇన్‌చార్జులు ఉన్నారు. ఆరుగురు యూనిట్ ఇన్‌చార్జులకు డైరెక్టర్ పదవులు దక్కాయి. 20 చైర్మన్ పదవుల్లో 16 టీడీపీ, మూడు జనసేన, ఒకటి బీజేపీకి లభించాయి. డైరెక్టర్ల పదవులను కూడా కూటమి పార్టీల మధ్య పంచారు.

త్యాగరాజులు వీరే..

తమ నియోజకవర్గాల్లో కొంతకాలం పనిచేసి తర్వాత రకరకాల కారణాలతో సీటు త్యాగం చేసిన 8 మంది టీడీపీ నేతలకు ఈ జాబితాలో చైర్మన్ పదవులు లభించాయి. వీరిలో మచిలీపట్నానికి చెందిన మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పోలవరం మాజీ ఎమ్మెల్యే బొరగం శ్రీనివాసులు, నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, డోన్ నియోజకవర్గానికి చెందిన మన్నె సుబ్బారెడ్డి, ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే పీతల సుజాత ఉన్నారు. వీరిలో నలుగురు మిత్రపక్షాల కోసం సీట్లు త్యాగం చేయగా.. మరో నలుగురు సొంత పార్టీ నేతల కోసం త్యాగం చేశారు. ఉదాహరణకు నాటి ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు మాజీ ఎంపీ రఘురామకృష్ణంరాజుకు అవకాశం కల్పించడం కోసం తాను పోటీ నుంచి వైదొలిగారు. అలాగే నెల్లూరులో నారాయణ అబ్దుల్ అజీజ్ తప్పుకొన్నారు. వారిద్దరికీ ఇప్పుడు పదవులు లభించాయి. మిత్రపక్షాలకు సీట్లు పోవడం వల్ల బొరగం శ్రీనివాసులు, బంగార్రాజు, పీలా గోవింద్ పోటీ చేయలేకపోయారు. వారికి కూడా నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం ఇచ్చారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎస్సీలకు రిజర్వు అయిన 3 అసెంబ్లీ సీట్లను టీడీపీ అధిష్ఠానం మాదిగ వర్గానికి కేటాయించింది. సామాజిక సమతుల్యత కోసం మాల సామాజిక వర్గానికి చెందిన పీతల సుజాతకు తాజాగా రాష్ట్ర విని యోగదారుల పరిరక్షణ మండలి చైర్‌పర్సన్ పదవి ఇచ్చారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన పార్టీ అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావుకు కూడా లిడ్‌క్యాప్ చైర్మన్ పదవి లభించింది. మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వారు అధికంగా ఉండడంతో ఆ వర్గానికి చెందిన నందం అబద్ధయ్యకు రాష్ట్ర పద్మశాలి సంక్షేమ-అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశమిచ్చారు. లోకేశ్ పాదయాత్రలో వాలంటీర్ల విభాగం కన్వీనర్‌గా పనిచేసిన తెలుగు యువత నేత రవి నాయుడికి శాప్ చైర్మన్ పదవి దక్కింది. అనేక మంది ఆశలు పెట్టుకున్న పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి ఒంగోలు జిల్లా పార్టీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ యాదవ్‌కు ఇచ్చారు. ఆయనతోపాటు ఎన్నికల సమయంలో జిల్లా పార్టీ అధ్యక్షులుగా పనిచేసిన నలుగురికి పదవులు దక్కాయి. వీరిలో కొనకళ్ల నారాయణ (కృష్ణా), అబ్దుల్ అజీజ్ (నెల్లూరు), బత్తుల తాతయ్య (అనకాపల్లి) ఉన్నారు. కుప్పంలో పార్టీ సీనియర్ నేత, బీసీ వర్గాలకు చెందిన పీఎస్ మునిరత్నానికి ఆర్టీసీ వైస్ చైర్మన్ పదవి లభించింది. దామచర్ల సత్యకు కూడా కీలకమైన ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ పదవి లభించింది. మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి మేనల్లుడు, పార్టీ అధికార ప్రతినిధి దీపక్ రెడ్డికి కొత్త ఉద్యోగాల కల్పనకు సంబంధించిన సీడాప్ చైర్మన్ పదవిని ఇచ్చారు.

డైరెక్టర్‌ పదవి వద్దన్న శిష్టా లోహిత్

పౌర సరఫరాల సంస్థలో డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శిష్టా లోహిత్ తనకు ఆ పదవి వద్దని పార్టీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబుకు మంగళవారం సాయంత్రం లేఖ రాశారు. 'నాకు ఈ పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు. మీరు అభిమానంతో ఇచ్చిన ఈ పదవిని తీసుకోవడానికి సిద్ధంగా లేను. నాకు కేటాయించిన ఈ పదవిని పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న మరెవరికైనా కేటాయించాలని నా మనవి. పదవి ఉన్నా, లేకున్నా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాను' అని అందులో పేర్కొన్నారు.

డైరెక్టర్లలో మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు

కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా వేసిన వారిలో మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు కూడా ఉండడం విశేషం. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి పరసా రత్నాన్ని మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమించారు. రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, సాలూరు మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భాంజుదేవ్‌ను పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్లుగా నియమితులయ్యారు.

కొనకళ్లకు ఆర్టీసీ...

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల కోసం ఎదురు చూస్తున్న ఆశావహులకు ప్రభుత్వం మంగళవారం శుభవార్త అందించింది. 20 కీలక నామినేటెడ్ చైర్మన్లు, పలు కార్పొరేషన్లకు సంబంధించి 79 మంది సభ్యులను ప్రకటించారు. వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వారి అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు సభ్యుల పేర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

20 సూత్రాల సంఘం, చైర్మన్: లంకా దినకర్ (బీజేపీ - ఒంగోలు)

పౌరసరఫరాల సంస్థ, చైర్మన్: తోట మెహర్ సీతారాం సుధీర్ (జనసేన - కాకినాడ సిటీ)

డైరెక్టర్లు: వంతల రాజేశ్వరి, మోకా ఆనంద్ సాగర్, రాయపాటి శైలజ, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, ప్రవీణ్‌తాజ్, శిష్టా లోహిత్, బోయ మహేష్ నాయుడు, గద్దె బాబూరావు, ఆర్‌పీ భాంజ్‌దేవ్, తోట పార్థసారథి, కోటేశ్వర కేశన్, కె.లక్ష్మీనారాయణ, తుమ్మల పద్మజ లక్ష్మి (బీజేపీ), కడలి ఈశ్వరి (జనసేన), బోడపాటి శివదత్(జనసేన)

ఏపీ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్, చైర్మన్: నందం అబద్దయ్య, మంగళగిరి

సభ్యులు: దాసరి శ్రీనివాస్, హరికిశోర్, గంజి మాధవయ్య, పి.పురుషోత్తం, కందుల నాగార్జున, మత్స్యెట్టి శివ సత్యప్రసాద్, సింగం వెంకటేశ్వరరావు, తాళ్ల నరసింహస్వామి, జొన్నాదుల మహేశ్వరరావు, శ్రీరామదాసు గంగాధర, పి. లక్ష్మి నరసింహులు, తేడా సత్యనారాయణ, బిట్రా వెంకటసత్యనారాయణ(బీజేపీ), పర్వతం మధుసూదన్‌రావు(జనసేన), సూరిశెట్టి జయనాగకృష్ణ(జనసేన)

ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చైర్మన్: పీలా గోవింద సత్యనారాయణ, అనకాపల్లి

సభ్యులు: పంతంగి నరసింహప్రసాద్, డాక్టర్ చందన స్రవంతి, గోనుగుంట్ల విజయ్‌కుమార్, దాసరి రాజా మాస్టర్, బచ్చల పుల్లయ్య, పూకా విజయ్‌కుమార్, రామాంజనేయులు(పాణ్యం), బూక్యా కాలే నాయక్, షేర్ రమణయ్య, వెంగమాంబ శ్రీనివాస్(బీజేపీ), యర్రా వేణుగోపాలరాయుడు, అంగ దుర్గ ప్రశాంతి(జనసేన), వడ్రాణం మార్కండేయ బాబు(జనసేన)

ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చైర్మన్: నూకసాని బాలాజీ, కొండెపి

సభ్యులు: పీవీజీ కుమార్, కిల్లు రమేష్‌నాయుడు, కుర్రా అప్పారావు, కటారి హేమలత, కైపా పద్మలతారెడ్డి, ఇందుకూరి సుబ్బలక్ష్మి, వాసిరెడ్డి రాంబాబు, కొడాలి వినోద్‌కుమార్, గంటా స్వరూపాదేవి(జనసేన), డాక్టర్ పాకంటి గౌతమ్‌రాజ్(జనసేన)

మార్క్‌ఫెడ్ చైర్మన్: కర్రోతు బంగార్రాజు, నెలిమర్ల

సభ్యులు: అన్నెపు రామకృష్ణనాయుడు, పరసా వెంకటరత్నం, కేసీ హరి, తాతిరెడ్డి తులసిరెడ్డి, వంగల శశిభూషణ్‌రెడ్డి(బీజేపీ), గుండుబోగుల నరసింహరావు(జనసేన)

ట్రైకార్, చైర్మన్: బొరగం శ్రీనివాసులు, పోలవరం

సభ్యులు: పూవల లావణ్య, తిరువీధి అనూరాధ, కుడా కృష్ణారావు(బీజేపీ)

ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చైర్మన్: మన్నె సుబ్బారెడ్డి, డోన్

సభ్యులు: కమతం కాటమయ్య, చిల్లా జగదేశ్వరి

స్టేట్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్, చైర్‌పర్సన్: పీతల సుజాత, భీమవరం **సభ్యులు:** నగిడి నాగేశ్వరరావు

ఆర్టీసీ, చైర్మన్: కొనకళ్ల నారాయణ, మచిలీపట్నం

వైస్ చైర్మన్: పీఎస్ మునిరత్నం

ఏపీఐఐసీ చైర్మన్: మంతెన రామరాజు, ఉండి

మారిటైం బోర్డు, చైర్మన్: దామచర్ల సత్య, కొండెపి

ఏపీ హౌసింగ్ బోర్డు, చైర్మన్: బత్తుల తాతయ్య బాబు, చోడవరం

ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీటీపీసీ), చైర్మన్: వజ్జా బాబూరావు, పలాస

లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చైర్మన్: పిల్లి మాణిక్యాలరావు, చీరాల

సీడాప్, చైర్మన్: దీపక్‌రెడ్డి, రాయదుర్గ

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్), చైర్మన్: అనిమిని రవినాయుడు, తిరుపతి

ఏపీ టిడ్కో, చైర్మన్: వేములపాటి అజయ్‌కుమార్(జనసేన), నెల్లూరు సిటీ

ఏపీఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, చైర్మన్: తమ్మిరెడ్డి శివశంకర్(జనసేన), శ్రీకాకుళం

వక్ఫ్‌బోర్డు, చైర్మన్: అబ్దుల్ అజీజ్, నెల్లూరు రూరల్

విశాఖ మేయర్‌పై ముడుపుల ఆరోపణలు

- రాజీనామాకు కూటమి కార్పొరేటర్ల పట్టు

విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకట కుమారిపై ముడుపుల ఆరోపణలు మిన్నంటాయి. జీవీఎంసీ పారిశుధ్య కార్మికుల జీతాల నుంచి ఆదాయ పన్ను పేరిట మినహాయించిన రెండు శాతం సొమ్మును కొంతమంది యూసీడీ అధికారులు, సిబ్బంది కలిసి పంచుకున్నారని, ఈ వ్యవహారంలో మేయర్‌కు కూడా ముడుపులు అందాయని టీడీపీ కార్పొరేటర్ ఆరోపించడంతో జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఒక్కసారిగా దుమారం రేగింది. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో టీడీపీకి చెందిన 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నారావు మాట్లాడుతూ జోన్-8 పరిధిలో పారిశుధ్య కార్మికులకు కొన్ని స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ద్వారా జీతాల చెల్లింపు జరుగుతోందన్నారు. ప్రతి నెలా కార్మికులకు ఇచ్చే జీతంలో రెండు శాతం ఆదాయ పన్ను (టీడీఎస్) కింద మినహాయిస్తున్నారని తెలిపారు. అయితే, సదరు కార్మికుడు ఆదాయ పన్ను శాఖకు రిటర్న్స్ సమర్పిస్తే ఆ మొత్తం తిరిగి ఖాతాలో జమ అయిపోతాయని, అలా చేయపోవడంతో రెండు శాతం కింద మినహాయించిన దాదాపు కోటి రూపాయలు వరకూ 95 ఎస్‌హెచ్‌జీల ఖాతాల్లో ఉండిపోయాయన్నారు. యూసీడీ విభాగంలో డీసీఎంగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి వి.నాగరాజు కొంతమంది ఆర్పీలతో కుమ్మక్కై కార్మికుల సొమ్మును ఎస్‌హెచ్‌జీల ఖాతాల నుంచి ఆర్పీల కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించేశారని కన్నారావు ఆరోపించారు. ఇలా వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రూ.4.75 కోట్ల వరకూ దోచుకున్నారన్నారు. దీనిపై విచారణ సజావుగా జరగాలంటే మేయర్ పదవికి హరివెంకటకుమారి రాజీనామా చేయాలంటూ కూటమి కార్పొరేటర్లు పట్టుబట్టడంతో సభలో ఉద్రిక్తత నెలకొంది. కూటమి సభ్యులు పోడియాన్ని చుట్టుముట్టడంతో ఎజెండాపై చర్చ ప్రారంభించకుండానే మేయర్ హరివెంకట కుమారి సభను బుధవారానికి వాయిదా వేశారు.

గర్భసంచికి బదులు మూత్రనాళం తొలగింపు

- అనంతలో సొంత ప్రైవేటు ఆస్పత్రిలో ప్రభుత్వ వైద్యుడి నిర్వాకం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 24: గర్భసంచి ఆపరేషన్‌కు వచ్చిన మహిళకు మూత్రనాళాన్ని తొలగించాడో ప్రభుత్వ వైద్యుడు. ఈ ఘటన అనంతపురం జిల్లా కేంద్రంలో వెలుగుచూసింది. బాధితుల కథనం మేరకు.. కూడేరు మండలం హంసాయపల్లికి చెందిన రాధమ్మ(33) అనారోగ్యానికి గురయ్యారు. వైద్యులు.. గర్భసంచి సమస్య ఉందని, తొలగించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో సర్వజన వైద్యశాలలో జనరల్ సర్జన్ రమణ నాయక్‌ను వారు సంప్రదించారు. ఆయన నగరంలో లావణ్య ప్రైవేట్ ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. రాధమ్మను అక్కడికి రమ్మని చెప్పి, ఈ నెల 9న ఆపరేషన్ చేశారు. అదే రోజు డిశ్చార్జి చేశారు. మరుసటి రోజు వరకు ఆమెకు మూత్రం రాకపోవడంతో తిరిగి లావణ్య ఆస్పత్రికి తీసుకొచ్చారు. తప్పు జరిగిందని గ్రహించిన డాక్టర్ రమణ నాయక్.. వారికి విషయం చెప్పకుండా ప్రభుత్వ ఆస్పత్రికి, ఆ తర్వాత కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే కిడ్నీలు వాపు వచ్చినట్లు గుర్తించిన వైద్యులు డయాలసిస్ చేశారు. కోలుకున్న తర్వాత తిరిగి అనంతపురం వచ్చి మరో ప్రైవేట్ కిడ్నీ ఆస్పత్రిలో చేర్పించారు. స్కానింగ్ చేసిన వైద్యులు.. మూత్రనాళాన్ని తొలగించారని, అందుకే సమస్య వచ్చిందని గుర్తించారు. దీనంతటికీ కారణం డాక్టర్ రమణ నాయక్ కావడంతో బాధిత కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి లావణ్య ఆస్పత్రి వద్దకు రాధమ్మను తీసుకువచ్చి ఆందోళనకు దిగారు. డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరుపుతున్నామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి తెలిపారు.

డీఎస్పీగా ఆమె ఎంపిక రద్దు!

- తప్పుడు సర్టిఫికెట్ సమర్పించిన ఫలితం: ఏపీపీఎస్సీ

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): డీఎస్పీ పోస్టుకు ధనుర్చ దాస్యం అనే అభ్యర్థి ఎంపికను రద్దు చేస్తున్నట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. 2022లో ఇచ్చిన గ్రూప్-1 నోటిఫికేషన్ ప్రకారం దరఖాస్తు చేసిన ఆమె స్పోర్ట్స్ కోటాలో డీఎస్పీ పోస్టుకు ఎంపికై ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు. ఆమె సమర్పించిన స్పోర్ట్స్ సరిఫికెట్లు సరైనవి కావంటూ ఏపీపీఎస్సీకి గతేడాది ఫిర్యాదు అందింది. ఆ ఫిర్యాదుపై దర్యాప్తు జరిపిన శాప్.. సీనియర్ లెవెల్‌లో స్పోర్ట్స్‌లో పాల్గొన్నట్లు ఆమె సర్టిఫికెట్ సమర్పించారని, అయితే ఆ సమయానికి ఆమె వయసు జూనియర్ లెవెల్‌లో పాల్గొనడానికి మాత్రమే సరిపోతుందని గుర్తించింది. దీనిపై ఏపీపీఎస్సీ షోకాజు నోటీసు జారీచేయగా, సరైన సపోర్టింగ్ డాక్యుమెంట్లను ఆమె సమర్పించలేదు. దీంతో ఆమె ఎంపికను రద్దు చేస్తున్నట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది. అయితే అంతకముందు ఆమె ఎక్సైజ్ శాఖలో ఏఈఎస్‌గా ఉన్నారు. ఆ ఉద్యోగం మెరిట్ ద్వారా వచ్చినందున అందులో కొనసాగవచ్చని అధికారవర్గాలు తెలిపాయి.

ఎస్టీలపై దాడుల్లో..

ఆంధ్రకు ఐదో స్థానం



- 2022లో 499 కేసులు నమోదు
- మొదటి స్థానంలో మధ్యప్రదేశ్
- ఎస్సీలపై దాడుల్లో యూపీ ఫస్ట్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: దేశంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించి నమోదైన కేసుల్లో 98.35 శాతం వరకు 13 రాష్ట్రాల్లోనే ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2022లో నమోదైన కేసులపై తాజా గణాంకాలతో కూడిన నివేదికను విడుదల చేసింది. ఆ ఏడాది ఎస్టీలపై దాడుల కేసులు 9,735 నమోదు కాగా.. మధ్యప్రదేశ్ మొదటి స్థానం(2,979-30.61%)లో ఉండగా.. ఆంధ్రప్రదేశ్ 499 కేసులతో ఐదో స్థానం(5.13%)లో నిలిచింది. ఎస్సీలపై దాడుల కేసులు 51,656 కాగా.. ఉత్తరప్రదేశ్ 12,287 కేసులతో ప్రథమ స్థానం(23.78%)లో నిలిచింది. రాజస్థాన్ (16.75%), మధ్యప్రదేశ్ (14.97%), బిహార్ (13.16%), ఒడిశా (6.93%), మహారాష్ట్ర (5.24%)తో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మొత్తం కేసుల్లో 81% ఈ ఆరు రాష్ట్రాల్లోనే నమోదు కావడం గమనార్హం. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద మొత్తంగా 60,391 కేసులు నమోదు కాగా.. 13 రాష్ట్రాల్లో నమోదైన వాటి శాతం 98.35 శాతం కావడం అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. కేసుల విచారణ పురోగతి గురించి కూడా నివేదికలో ప్రస్తావించారు. 60.38 శాతం ఎస్సీ సంబంధ కేసుల్లో చార్జిషీట్లు దాఖలయ్యాయి. తప్పుడు ఆరోపణలు, సాక్ష్యాధారాలు లేకపోవడం వంటి వాటివల్ల 14.78 శాతం కేసులను మూసివేశారు. 2022 చివరినాటికి 17,166 కేసుల్లో దర్యాప్తు పెండింగ్‌లో ఉంది. ఎస్టీ సంబంధ కేసుల్లోనూ 2,702 కేసుల విచారణ పెండింగ్‌లో ఉంది. 63.32% కేసుల్లో చార్జిషీట్లు నమోదు కాగా.. 14.71 శాతం కేసులు మూసివేశారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో శిక్షలు పడడం కూడా గణనీయంగా తగ్గిపోయింది. 2020లో 39.2 శాతం కేసుల్లో శిక్షలు పడగా.. 2022 నాటికి 32.4 శాతానికి తగ్గింది. చట్టప్రకారం ఈ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు సరిపడా లేకపోవడమూ కారణమని కేంద్రం తన నివేదికలో వెల్లడించింది. కేసుల సత్వర విచారణకు 14 రాష్ట్రాల్లోని 498 జిల్లాల్లో 194 ప్రత్యేక కోర్టులు మాత్రమే ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీలపై దాడులు 10 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎక్కడ జరుగుతున్నాయో కూడా ప్రభుత్వం గుర్తించింది. పై 498 జిల్లాల్లో కులహింస, ఎస్సీ, ఎస్టీలపై దాడులను అడ్డుకుని వారిని కాపాడేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేకంగా జోక్యం చేసుకోవాలని కేంద్రం నొక్కిచెప్పింది. ఆంధ్ర, తెలంగాణ సహా 24 రాష్ట్రాలు, ఢిల్లీ, అండమాన్ సహా 6 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రభుత్వాలు ఎస్సీ/ఎస్టీ పరిరక్షణ విభాగాలను నెలకొల్పాయని తెలిపింది. బిహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, కేరళ, మధ్యప్రదేశ్ ఎస్సీ, ఎస్టీలపై దాడుల కేసుల నమోదుకు ప్రత్యేక పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశాయని వెల్లడించింది.

ఎస్టీలపై దాడులు (2022లో)

రాష్ట్రం	కేసుల సంఖ్య
మధ్యప్రదేశ్	2,979
రాజస్థాన్	2,498
ఒడిశా	773
మహారాష్ట్ర	691
ఆంధ్రప్రదేశ్	499

ఎస్సీలపై దాడులు (2022లో)

రాష్ట్రం	కేసుల సంఖ్య
ఉత్తరప్రదేశ్	12,287
రాజస్థాన్	8,651
మధ్యప్రదేశ్	7,732
బిహార్	6,799
ఒడిశా	3,576
మహారాష్ట్ర	2,706

డ్రగ్స్ విభాగానికి ఇన్‌చార్జులే దిక్కు!

- డీజీ.. డైరెక్టర్ రెండు పోస్టుల్లోనూ ఇన్‌చార్జులే
- ఆ రెండు పోస్టులూ లక్ష్మీషా చేతుల్లోనే
- డ్రగ్స్ విభాగంలో గాడి తప్పిన పాలన
- రిటైర్ అయిన వ్యక్తికే మళ్లీ డైరెక్టర్ పదవి?
- ఆయనపై తీవ్ర ఆరోపణలున్నాయని విమర్శలు

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఔషధ నియంత్రణ మండలిలో (డ్రగ్) పాలన గాడి తప్పుతోంది. ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు డ్రగ్స్ విభాగాన్ని పూర్తిగా పక్కన పెట్టేశారు. డ్రగ్స్ విభాగాన్ని ఇన్‌చార్జుల చేతుల్లో పెట్టేశారు. ప్రస్తుతం డ్రగ్స్ డీజీగా లక్ష్మీషా ఉన్నారు. ఆయనను ఏపీఎంఎస్ఐడీసీకి రెగ్యులర్ ఎండీగా ప్రభుత్వం నియమించింది. దానితోపాటు డ్రగ్స్ డీజీ, ఎన్టీఆర్ వైద్య సేవ సీఈవోగా అదనపు బాధ్యతలు ఆయనే చూస్తున్నారు. ఆరోగ్యశాఖలో మూడు కీలక విభాగాలకు ఒక్క అధికారే హెచ్‌వోడీగా ఉండడం పెద్ద సమస్యగా మారింది. ముఖ్యంగా డ్రగ్ విభాగం మొత్తం ఇన్‌చార్జిల చేతుల్లో పెట్టడంతో పాలన పడకేసింది. మొన్నటి వరకూ డ్రగ్స్ డైరెక్టర్‌గా ఉన్న ఎంబీఆర్కే ప్రసాద్ గత నెలలో రిటైర్ అయ్యారు. ఆయన స్థానంలో ప్రభుత్వం కొత్తవారిని నియమించలేదు. డైరెక్టర్ ఇన్‌చార్జి బాధ్యతలు కూడా లక్ష్మీషాకే ప్రభుత్వం అప్పగించింది. దీంతో మొత్తం నాలుగు పోస్టుల్లో ఆయన కొనసాగుతున్నారు. ముఖ్యంగా డ్రగ్స్ డీజీ ఇన్‌చార్జి, డ్రగ్స్ డైరెక్టర్ ఇన్‌చార్జి ఆయనే కావడంతో ముఖ్యమైన ఫైళ్లు పెండింగ్‌లో పడుతున్నాయి. ముఖ్యమైన విచారణ కేసులు, నాన్ స్టాండెడ్ క్వాలిటీ డ్రగ్స్‌కు సంబంధించిన ఫైళ్లు, లైసెన్స్‌లు మొత్తం పెండింగ్‌లో ఉన్నాయి. డ్రగ్ విభాగం మొత్తం ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవహారాలు కాబట్టి రెగ్యులర్ అధికారులు కచ్చితంగా ఉండాలి. కూటమి ప్రభుత్వం రాకముందు వరకూ కొల్లి రఘురామరెడ్డి డ్రగ్స్ డీజీగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వం ఆయనను తొలగించింది. అతని స్థానంలో రెగ్యులర్ డీజీగా ఐపీఎస్ అధికారిని నియమించలేదు. దీంతో ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు అప్పటికే ఆరోగ్యశ్రీ సీఈవోగా ఉన్న లక్ష్మీషాకు డ్రగ్స్ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. డైరెక్టర్ పోస్టు కూడా డ్రగ్స్‌లో చాలా కీలకమైనది. లైసెన్సింగ్ అథారిటీ ఆయనదే. దీంతో డైరెక్టర్ లేకుండా డీజీ కూడా ఏమీ చేయలేని పరిస్థితి. ప్రస్తుతం డైరెక్టర్‌గా కూడా లక్ష్మీషా ఉన్నా కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా ఆయనకు లైసెన్స్‌లు జారీచేసే అధికారం లేదు. కాబట్టి ప్రభుత్వం వెంటనే కొత్త డైరెక్టర్‌ను నియమించాల్సి ఉంది. మరోవైపు ఇప్పటికే రిటైరైన ఎంబీఆర్కే ప్రసాద్ మరోసారి డైరెక్టరయ్యేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఆయనకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. 2016 నుంచి దాదాపు ఎనిమిదేళ్లపాటు ఆయనే డ్రగ్స్ డైరెక్టర్‌గా ఉన్నారు. మళ్లీ శాఖలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయనపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని మరోసారి డైరెక్టర్‌గా నియమించాలనుకోవడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాల్సి ఉంది. డ్రగ్స్ విభాగానికి రెగ్యులర్ డీజీ, డైరెక్టర్‌ను నియమించాలని ఆ విభాగం సిబ్బంది కోరుతున్నారు.

నగరాలకు ప్రత్యేక వాతావరణ బులెటిన్లు

- త్వరలోనే మోడలింగ్ వ్యవస్థ అభివృద్ధి
- ఐఎండీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ మహాపాత్ర



విశాఖపట్నం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో నగరాలు, పట్టణ ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నందున ప్రత్యేకించి వాటి కోసం బులెటిన్లు విడుదల చేసేందుకు మోడలింగ్ వ్యవస్థ అభివృద్ధి చేస్తామని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ మహాపాత్ర వెల్లడించారు. ఇప్పటికే దేశంలో ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై నగరాలకు వర్షాలు, హీట్ వేవ్స్‌కు సంబంధించి ప్రత్యేక బులెటిన్లు ఇస్తున్నామని పేర్కొన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ)లోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో మంగళవారంనిర్వహించిన విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం స్వర్ణోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... దేశంలో అనేక నగరాలు, పట్టణాల్లో జనాభా విపరీతంగా పెరుగుతుండడంతో ఆయా ప్రాంతాలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంక్రీట్ జంగిల్స్‌గా మారిన పట్టణాలు, నగరాల్లో వాహన వినియోగం, భారీఎత్తున జరుగుతున్న భవన నిర్మాణాల ప్రభావంతో అర్బన్ హీట్ ఐలాండ్లు ఏర్పడి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయన్నారు. గ్రామాలతో పోల్చితే పట్టణాలు, నగరాల్లో వర్షపాతం 10 నుంచి 15 శాతం ఎక్కువగా నమోదవుతుందన్నారు. అయితే భారీవర్షాలు కురిసినప్పుడు నీరు వెళ్లే వ్యవస్థలు సజావుగా లేకపోవడంతో నగరాలు నీట మునుగుతున్నాయని పేర్కొన్నారు. వరదలు, ఇతర విపత్తులు సంభవించేటప్పుడు నగరాలు, పట్టణ ప్రాంతాలకు ప్రత్యేకించి వాతావరణ సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఉందని గుర్తుచేస్తూ త్వరలో మోడలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఇందుకు అనుగుణంగా రెయిన్‌గేజ్‌లు, ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు చేయాల్సి ఉందని, రాడార్‌ల నుంచి సమాచారం తీసుకోవాల్సి ఉందని తెలిపారు. వాతావరణ మార్పులతో గాలిలో తేమ శాతం పెరిగి మేఘ విచ్ఛిన్న తీవ్రత పెరిగినందున కొన్నిచోట్ల కుండపోతగా వర్షాలు కురుస్తుండడంతో అక్కడి ప్రజలు నష్టపోతున్నారన్నారు. ఇప్పటివరకూ జిల్లా, బ్లాక్, ముఖ్యమైన ప్రాంతాల్లో రెయిన్‌గేజ్‌లు ఉన్నాయని, రానున్న రోజుల్లో ప్రతి పంచాయతీలోనూ వీటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే 'హర్ ఘర్ మౌసం' నినాదంతో ప్రతి ఇంటికీ వాతావరణ సమాచారం అందించేలా మిషన్ మౌసం ద్వారా నమూనాలు రూపొందిస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 2030 నాటికల్లా ప్రతి పంచాయతీకి వాతావరణ బులెటిన్లు ఇస్తామన్నారు. ఐదు దశాబ్దాల కిందటితో పోల్చితే వాతావరణ సమాచారంలో కచ్చితత్వం 50 శాతం వరకు మెరుగుపడిందన్నారు. పిడుగులు, ఉరుములపై మూడు గంటల ముందు బులెటిన్లు ఇస్తున్న ఐదు దేశాల్లో భారత్ ఒకటని మహాపాత్ర పేర్కొన్నారు. దేశంలోని వాయవ్య భారతంలో పలు ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాల ఉపసంహరణ మొదలైందని చెప్పారు. అయితే పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో తూర్పు, మధ్య భారతంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, రుతుపవనాల నిష్క్రమణ కొద్దిరోజులు నిలిచి.. తర్వాత అక్టోబరు 15వ తేదీకల్లా దేశం నుంచి వైదొలుగుతాయని చెప్పారు.

హజ్ దరఖాస్తు గడువు 30 వరకు పెంపు: ఫరూక్

అమరావతి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు గడువును మరోసారి పొడిగించినట్లు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మంగళవారం తెలిపారు. రాష్ట్రం నుంచి హజ్‌యాత్రకు వెళ్లేందుకు ఇప్పటి వరకు 1,937 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ఇందులో 1,589 దరఖాస్తులు సక్రమంగా ఉన్నాయని తెలిపారు. సీఎం చంద్రబాబు హజ్‌యాత్రకు వెళ్లే వారికి రూ.లక్ష ఆర్థికసాయం అందించబోతున్నట్లు తెలిపారు. విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుంచి హజ్‌కి వెళ్లే రాష్ట్ర ప్రయాణీకులకు మాత్రమే ఈ సౌలభ్యం ఉంటుందని మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ అవకాశాన్ని రాష్ట్రం నుంచి హజ్ వెళ్లే యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని ఫరూక్ కోరారు. రాష్ట్రంలో రూ.105 కోట్లతో మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేసి, మైనార్టీ యువత నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు కార్యాచరణ అమలు చేయబోతున్నట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. వీటిని గుంటూరు, నంద్యాల, అనంతపురం జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణలో భాగంగా ఏఐ, డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి అధిక డిమాండ్ ఉన్న అధునాతన కోర్సుల్లో మైనార్టీ యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.